# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :202 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 12-10-2024 పేజీలు:4 వెల: 2.00


## పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు

హైదరాబాద్,తాను పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు.. నా చరిత్ర అందరికీ తెలుసు అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకీ పెట్టిన రేవంత్ రెడ్డా నా గురించి మాట్లాడేది అని వినోద్ కుమార్ చురకలంటించారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు.నాకు ఓడిపోతే కేసీఆర్ ఉద్యోగం ఇచ్చారని రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆరంభం నుంచి నేను ఉన్నాను. నేను తెలంగాణ కోసం ఎంపీగా రాజీనామా చేసి గెలిచాను. ఢిల్లీలో తెలంగాణ కోసం 32 పార్టీలను ఒప్పించేందుకు కేసీఆర్‌తో కలిసి ప్రయత్నించాను. ప్లానింగ్ బోర్డు చైర్మన్‌గా నా భాద్యతను తెలంగాణ అభివృద్ధి కోసం నిర్వర్తించాను. నా గురించి సీఎం హేళనగా మాట్లాడారు కనుకే స్పందిస్తున్నానని వినోద్ కుమార్ తెలిపారు.కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చినా మేము ప్రచారం చేసుకోలేదు. మేము ఉద్యోగాలు ఇస్తే నియామక పత్రాలు పోస్టులో వెళ్ళేవి. ఇపుడు ఎల్బీ స్టేడియంలో ఇస్తున్నారు. మేమిచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారు

## నాణ్యమైన విద్యను అందించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్



నల్లగొండ : కోటీశ్వరుల పిల్లల మాదిరిగానే పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలనుకట్టిస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న గంధంవారి గూడెం వద్ద రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడె న్షియల్ పాఠశాల పైలాన్ ఆవిష్కరించి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంగ్లీష్ , తెలుగు మీడియంలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ పిల్లలందరూ కులమతాలకు అతీతంగా చదువుకోవచ్చని తెలిపారు.ఈ పాఠశాలల్లో చదువుతోపాటు ,అన్ని వసతులు ఉంటాయని, ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేస్తున్నామని, క్రీడల వల్ల మానసికంగా విద్యార్థులు ఎదుగుతారని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల శంకుస్థాపనతో తెలంగాణకు ఒక రోజు ముందుగానే దసరా పండుగ వచ్చిందని అన్నారు. 5000 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలలో మొదటి విడతన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సిల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

## వైసీపీ ప్రభుత్వం అవినీతిలో విప్లవం సృష్టించింది..



అమరావతి, గత వైసీపీ ప్రభుత్వం అవినీతిలో విప్లవం సృష్టించిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. అత్తారింటికి దారేది తరహాలో రాష్ట్రంలోని సంపద అంతా తన ఇంటికి వచ్చేలా గత పాలకులు ప్రణాళికలు రచించుకున్నారని ఎద్దేవా చేశారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ మొదటి అంతస్తులోని తన కార్యాలయంలో శుక్రవారం నాడు మంత్రి పార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తన చాంబర్ పనులు పూర్తికాకపోవడంతో తాత్కాలిక చాంబర్‌లో విధులు నిర్వహించారు. తాజాగా చాంబర్ పనులు పూర్తవ్వడంతో ఇవాళ కొత్త చాంబర్‌లోకి మారారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పరిపాలనలో చేసిన తప్పులను ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చక్కదిద్దుతున్నారని తెలిపారు.వంద రోజుల పాలనలో ఇబ్బందులున్నా అనేక సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సత్తా చాటేలా ఒకే రోజులో 60 లక్షలకు పైగా పింఛన్లు పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుదే అని తెలిపారు. గత ప్రభుత్వం అన్నింటిపైనా రంగులు, బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల సొమ్మును జాగ్రత్తగా కాపాడుతుందని తెలిపారు.

## వైభవంగా ముగిసిన బతుకమ్మ వేడుకలు



హైదరాబాద్,అక్టోబర్11: తొమ్మది రోజుల పాటు సందడి చేసిన బతుకమ్మ సంబరాలు ముగిసాయి. వచ్చే యేడాది మళ్లీ రావమ్మా అంటూ ఆడపడచులు వీడ్కోలు పలికారు. గురువారం సద్దుల బతుకమ్మతో ఊరూవాడ సందడిగా కొనసాగింది. ఆడపడుచుల వీడ్కోలుతో బతుకమ్మ సాగిపోయింది. తెలంగాణలో ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు పూల జాతరతో జరుపుకున్న బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిసింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా పల్లె, పట్నం, ఊరూ, వాడా, తంగేడు, గునుగు పువ్వుల వనాలయ్యాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. మొత్తంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబురంగా ముగిసింది. తెలంగాణ ఇంట ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు రకరకాలపూలతో ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఆడబిడ్డలు రామ రామ రామ ఉయ్యాలో.. తొమ్మిది రోజులు ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. ముప్పై మూడు జిల్లాల తెలంగాణ బిడ్డలకు దీవెనలు ఇస్తూ బతుకమ్మ.. గంగమ్మ ఒడికి చేరింది. పూల సింగిడి సందడి చేసింది.. సద్దుల సంబురం కనులవిందు చేసింది.. ఆడపడుచుల ఆనందం ఆకాశాన్నంటింది.. తొమ్మిదిరోజుల పాటు సంబురంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు సంబురంగా జరుపుకున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ సంబురాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగవైభవంగా జరిగాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొని చివరిరోజు ట్యాంక్‌బండ్‌తో సహా, జిల్లాల్లో భారీ బతుకమ్మతో వేడుకలు నిర్వహించుకోగా సద్దుల బతుకమ్మను జిల్లా మహిళా మణులు భారీ బతుకమ్మలతో ఆడిపాడారు. అన్ని గ్రామాల్లో పూలపండగతో మహిళలు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున బతుకమ్మ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజు ప్రతీ ఇంటా బతుకమ్మను పేర్చి ఇళ్లవాకిళ్ల ఎదుట బతుకమ్మ పాటలతో ఆడిపాడి చివరికి బతుకమ్మ ఘాట్‌ల వద్ద కూడా చిందేశారు. బతుకమ్మ ఉత్సవంలో చివరిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. ఆడపడుచులతో ఆడిపాడి సంబురంలో పాల్గొన్నారు. గల్లీల నుంచి పట్నం వరకు చిన్నారుల నుంచి పెద్దల వరకు బతుకమ్మ ఉత్సవాలను కనుల పండువగా జరుపుకున్నా రు. ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రోజుకొక శాఖ ఉద్యోగులు కార్యాలయాల్లో బతుకమ్మలు పేర్చి డీజే పాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలు ట్యాంక్‌బండ్ వద్ద సంబరంగా సాగాయి. సాంస్కృతిక కళారూపాలతో, పెద్దఎత్తున డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలతో ట్యాంక్‌బండ్‌వరకు ఊరేగింపు కళాత్మకంగా సాగింది. రాత్రి పొద్దుపోయేవరకు ట్యాంక్‌బండ్‌పై ఆడబిడ్డలు బతుకమ్మ ఆడారు. వరంగల్ నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వేల మంది మహిళలు హన్మకొండలోని పద్మాక్షి గుండం, వరంగల్‌లోని రంగసముద్రం వంటి ప్రాంతాల్లో ఆడిపాడారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సద్దుల పండుగ ఉత్సాహంగా సాగింది. పలు ప్రాంతాల్లో ఉత్తమ పాట, ఆటలకు బహుమతులు ప్రకటించడంతో ఆడిపాడేందుకు యువతులు పోటీపడ్డారు. సిద్దిపేటలో పెద్ద ఎత్తున కోమటి చెరువు వద్ద ఆడిపాడారు.

## సిద్ధదాత్రి అవతారంలో అమ్మవారి దర్శనం



బాసర : నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రంలోని శ్రీజ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారి సన్నిధిలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. శ్రీజ్ఞాన సరస్వతీదేవీ సిద్ధదాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు విశేష సహస్రనామార్చన చేశారు. పాయసం నైవేద్యంగా సమర్పించారు.

### తెల్లవారు జాము నుంచి దర్శనాలు

తెల్లవారు జాము ఐదు గంటల నుంచి శ్రీజ్ఞాన సరస్వతీ దేవీ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహకాళి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో అభిషేక అర్చనలు చేశారు. అనంతరం సరస్వతీ ఆలయానికి చేరుకుని పిల్లలకు అక్షరాభ్యాసం చేసి అనంతరం ముగ్గురు అమ్మవార్లను దర్శించుకున్నారు.అమ్మవారి సన్నిధిలోని నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. కాల చేప మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలను

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం.. తెలంగాణలో యంగ్ ఇండియా స్కూళ్లు..



హైదరాబాద్,తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 28 స్కూళ్లకు శంకుస్థాపన చేయనున్నారు ముఖ్యమంత్రి. ఈ కార్యక్రమానికి షాద్ నగర్ నియోజకవర్గం కేంద్రమైంది.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాల్లోని విద్యార్థులు ఈ స్కూళ్లలో ఉండబోతు న్నాయి. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను ఇందులో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో లైబ్రరీ (ఐదు వేల పుస్తకాలు), 60 కంప్యూటర్లు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉండనున్నాయి.ఒకేసారి 900 మంది కూర్చుని భోజనాలు చేసేలా డైనింగ్ హాలు నిర్మిస్తారు. ప్రతీ రూమ్‌లో 10 బెడ్స్, రెండు బాత్ రూమ్స్ ఉండనున్నాయి. సింపుల్ గా చెప్పాలంటే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ క్యాంపస్ అన్నమాట.కల్చరల్ కోసం ప్రత్యేక ఆడిటోరియం, ఇండోర్, అవుట్ డోర్, స్పోర్ట్స్ సదుపాయాలు వీటి సొంతం. హాస్పటల్ కూడా ఉండబోతోంది. ఒక్కో గురుకులంలో 2500 మంది వరకు చేరడానికి అవకాశం ఉంది. 5 నుంచి ఇంటర్ వరకు ఇందులో చదువు కొనసాగించవచ్చు.ప్రతీ స్కూల్‌కు 120 మంది ఉపాధ్యాయులు ఉండనున్నారు. గురుకులాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరనున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా తొలి విడతగా 28 స్కూళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. షాద్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టున్నారు. మిగతా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలు చేయనున్నారు. కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్,మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్,కొల్హాపూర్,అందోలు,చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి,అచ్చంపేట, స్టేషన్ ఘనపూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూ రు, షాద్ నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూరు, నర్సంపేట వంటి నియోజకవర్గా లున్నాయి.రెండో దశలో నిర్మించే నియోజకవర్గాల పరిధిలో భూముల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది.

## స్పెషల్ పోలీసుల దాడి.. రూ.2వేల కోట్ల డ్రగ్స్ సీజ్




న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఢిల్లీలోని రమేష్ నగర్‌లో పోలీసులు పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. గురువారం ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 200 కిలోల కొకైన్‌ను పట్టుబడింది.దీని విలువ రూ. 2 వేల కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. వారం రోజుల్లో ఇప్పటివరకు సుమారు 7 వేల కోట్ల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.రమేష్ నగర్‌లోని మూసి ఉన్న దుకాణం నుంచి కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 200 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి విలువ రూ.2,000 కోట్లకుపైగా ఉంటుందని తెలిపారు. ఈ డ్రగ్‌ను నమ్‌కీన్ ప్యాకెట్లలో ఉంచినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.ఢిల్లీ స్పెషల్ పోలీసులు జీపీఎస్ ద్వారా డ్రగ్స్ సరఫరాదారుని ట్రాక్ చేసి.. పశ్చిమ ఢిల్లీలోని రమేష్ నగర్‌లో ఓ వ్యక్తిని పట్టుకున్నారు. నిందితులు లండన్‌కు పరార్ అయినట్లు తెలిపారు. అక్కడ లభించిన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారం రోజుల్లో రూ. 7,500 కోట్ల విలువైన 762 కిలోల డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు. గత వారం ఢిల్లీలో 500 కిలోల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ ఢిల్లీలో దాడులు చేసి.. డ్రగ్స్‌తో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసుల అరెస్టు చేశారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని విమానాశ్రయంలో జస్సీ అలియాస్ జితేంద్ర పాల్ సింగ్‌ను స్పెషల్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. అతను లండన్ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదుపు లోకి తీసుకున్నారు. వీరికి దేశంలోని పలు నేరాలు, అక్రమ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న పాన్ ఇండియా నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు.

## ఉత్పత్తి,ఉత్పాదకత పెంచకపోతే ప్రమాదంలో సింగరేణి



హైదరాబాద్,సింగరేణి కాలరీస్ సుస్థిర భవిష్యత్ కోసం సంస్థ ఆర్థిక స్థితిగతులపై ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉండాలని లాభాల వాటా పంపిణీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించిన నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర అన్న అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.సింగరేణి భవన్ లో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ముఖ్య అతిథిగా మాట్లాడి కంపెనీ ఆర్థిక పరిస్థితులను, పనితీరును వివరించారు. సింగరేణి ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగు పరుచుకోకపోతే కంపెనీ మనుగడ చాలా కష్టమని, పని సంస్కృతిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి కార్మికులతో పాటు కార్మిక సంఘాలు కూడా సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన కంపెనీకి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను ఉద్యోగులతో పంచుకున్నారు. ఇప్పుటి వరకు సింగరేణి సంస్థ సాధిస్తున్న లాభాలు కేవలం బొగ్గు ఉత్పత్తి వల్లనే అని చాలామంది భావిస్తున్నారని, కానీ వాస్తవానికి బొగ్గు వల్ల వస్తున్న లాభాల కన్నా ఇతరత్రా ఫైనాన్షియల్ ఇంజనీరింగ్ వల్ల సమకూరుతున్న నిధులతోనే లాభాలు పెరిగాయన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడం కోసం గత నాలుగేళ్లలో అనేక విప్లవాత్మక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.ఆర్థిక పరపతి గతంలో AA- గా ఉండేదని, దీనిని చక్కదిద్దడం కోసం చేసిన కృషి ఫలితంగా ఇప్పుడు సింగరేణి సంస్థ %ూూా%ం స్థాయికి చేరింది అన్నారు. గతంలో సింగరేణి సంస్థ అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగేదని, ఇప్పుడు సింగరేణి సంస్థ ఆర్థిక పరపతి పెరిగినందు వల్ల బ్యాంకులు వారు సింగరేణి సంస్థకు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు.గతంలో సింగరేణి సంస్థ ఎక్కువ వడ్డీలకు తెచ్చిన అప్పులను తక్కువ వడ్డీలకు ఇచ్చే బ్యాంకులకు బదలాయించడంతో వడ్డీ భారం తగ్గిందన్నారు. బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. సింగరేణికి బకాయిలు పడిన పలు విద్యుత్ వినియోగదారులకు సింగరేణి పరపతితో తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించడం జరిగిందని, తద్వారా సింగరేణి సంబంధించిన బకాయిలు దాదాపు 20 వేల కోట్లు వసూలు అయ్యాయని తెలిపారు.దీనివల్ల తక్కువ వడ్డీకి విద్యుత్ సంస్థలకు రుణాలు లభించడం వల్ల కోట్లాది మంది విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గిందన్నారు. కంపెనీ భవిష్యత్ కోసం చేసిన డిపాజిట్ల వల్ల వచ్చే వడ్డీ ఆదాయం రూ.900 కోట్లకు పైగా ఉంటోందని, అలాగే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా ఏడాదికి సుమారు రూ.500 కోట్ల లాభం సమకూరుతుందని, ఇవన్నీ కలిసి సింగరేణి సంస్థ లాభాల్లో ఉన్నట్లు కనపడుతుందన్నారు.సింగరేణి వాస్తవ ఆర్థిక పరిస్థితి తెలియక అందరూ సింగరేణి వద్ద కోట్లాది రూపాయల లాభాలు ఉంటున్నాయని భావించి తమ తమ డిమాండ్లను ముందు పెడుతున్నారని, కనీసం సింగరేణి అధికారులు ఉద్యోగులకైనా సరే వాస్తవ పరిస్థితి తెలుసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.భూగర్భంలో టన్ను బొగ్గు ఉత్పత్తికి 10,000 ఖర్చు అవుతుండగా, బొగ్గు అమ్మకం ధర కేవలం 5000 లోపే ఉందని, టన్నుకు సుమారు 5000 నుండి 6000 రూపాయల నష్టం వాటిల్లుతోందన్నారు. భూగర్భ గనుల్లో ఉన్న ఎస్‌డిఎల్, ఎల్‌హెచ్‌డి యంత్రాలను రోజుకు కేవలం 6 గంటలు మాత్రమే వినియోగిస్తున్నారని, కనుక నష్టాలు భారీగా ఉంటున్నాయన్నారు.ఓపెన్ కాస్ట్ గనుల్లో కూడా భారీ యంత్రాల వినియోగం 24 గంటల్లో కేవలం 12 గంటలు మాత్రమే ఉంటుందని, ఈ విధంగా మొత్తం మీద చూస్తే బొగ్గు అమ్మకం ద్వారా లభించే లాభాలు దాదాపు 1 శాతం కన్నా తక్కువగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక రానున్న పోటీ మార్కెట్ లో నిలబడాలంటే సింగరేణి కార్మికులు యంత్రాలను పూర్తి సమయం వినియోగించాల్సిన అవసరం ఉందని, లేదంటే సింగరేణి సంస్థ మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్మికులకు అన్ని విషయాలు వివరించమని ఆదేశించిన నేపథ్యంలో ఈ వాస్తవాలు వెల్లడిస్తున్నామన్నారు.


పాఠకులకు,ప్రకటనకర్తలకు,మిత్రులకు,శ్రేయోభిలాషులకు మరియు ప్రజలకు అందరికి విజయదశమి శుభాకాంక్షలు...ఎడిటర్

## సంపాదకీయం

శనివారం 12-10-2024

# స్త్రీలను రేప్ చేయడానికి పెళ్లి ఒక లైసెన్స్ కారాదు

క్షేత్ర బీజ న్యాయపు మనుధర్మంపై ఆధారపడి వేల ఏళ్లుగా నడుస్తున్న మన కుటుంబ, వైవాహిక వ్యవస్థ స్త్రీలని స్వతంత్రమైన మనుషులుగా, సమాన హక్కులు వుండే పౌరులుగా పరిగణించిన పాపానపోలేదు ఎప్పుడూ. నస్త్రీ స్వాతంత్ర్య మర్హతే అంటూ స్త్రీలను బాల్యంలో తల్లిదండ్రుల ఆధీనంలోనూ, వివాహం తర్వాత భర్త ఆధీనంలోనూ, వృద్ధాప్యంలో పుత్రుల ఆధీనంలోనూ ఉండాలి అని నిర్దేశించిన భావ జాలం నుండి మన సమాజం ఏనాడూ బయట పడిందిలేదు. పశువును, స్త్రీని నియంత్రణలో ఉంచేందుకు బలప్రయోగం తప్పనిసరి అనే చెప్పే ధర్మశాస్త్రాలు, విశ్వాసాలు, సంస్కృతులు మన న్యాయ, రాజకీయ, సాంఘిక వ్యవస్థలకు ఆధారాలు. 2022న కర్ణాటక హైకోర్టు ఒక మంచి తీర్పునిచ్చింది. భర్త భార్యపై మ్యారిటల్ రేపు చేయడం అది ఏ రకంగానూ అభ్యంతరం కాదు అనేది కాలం చెందిన అత్యంత హేయమైనా దృక్పథం అంటూ, అత్యాచారం అనేది ఎక్కడన్నా అత్యాచారమే. అది భర్త అనే పేరుతో చేసినా, అది భార్య అనే ఆమె పైన చేసినా అనింది. అది మరో గొప్ప వ్యాఖ్యానం, స్త్రీలను రేప్ చేయడానికి పెళ్లి ఒక లైసెన్స్ కాదు అని కూడా స్పష్టంగా చేసింది. పురుషాధిపత్య సమాజంలో స్త్రీలు తమ ఇంట్లోనే ఉన్న శత్రువును గుర్తించడం, పోరాడటం అంత తేలికైన విషయం ఏమీకాదు. ఈ విషయంలో చట్టంతో సహా ఏ వ్యవస్థలూ ఆమెకి మద్దతును ఇవ్వవు. పైగా బాధితురాలినే నేరస్థురాలిని చేసి బోను ఎక్కిస్తాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ హెచ్ఎఫ్ఎస్- 5) అధ్యనం ప్రకారం వివాహితులైనటువంటి మహిళల్లో 32% మంది మహిళలు భారత దేశంలో వాళ్ళ భర్తల చేతులలో శారీరక, లైంగిక, మానసికపరమైన హింసలను ఎదుర్కొంటూ ఉన్నారు. 1920 -21 నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే బై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రకారం 17.6% అంటే లక్ష మందికి పైగా మహిళలు 15 నుంచి 49 వయసు మధ్యలో ఉన్న వాళ్ళు, తమ భర్తలు తమపై చేసే లైంగిక చర్యని తాము నివారించలేమని, వాళ్ళు ఎంతో అభ్యంతరకరంగా, హింసాత్మకంగా తమతో సెక్స్ చేసినా వాళ్ళకు కాదని చెప్పలేని స్థితిలో తాము ఉన్నామని చెప్పగా, మరో 11 శాతం మంది తాము నిరాకరిస్తే, భర్తల చేతుల్లో దెబ్బల్ని తింటామని అంటూనే, ఆ పని చేసే హక్కు భర్తలకు ఉందని భావిస్తూ ఉన్నారు. మరో సర్వేలో 40% మంది మహిళలు, 38% మంది మగవారు భార్యను కొట్టడం చాలా సహజమైన విషయమని అది అంత పట్టించుకోవాల్సిన సంగతి ఏం కాదని అన్నారు. ప్రపంచంలో జెండర్ బేస్డ్ వైయలెన్స్‌ని ప్రతి ముగ్గురిలో ఒక మహిళ ఎదుర్కొంటున్నట్లు డబ్ల్యు.హెచ్.ఒ. నివేదిక చెప్తూ ఉంది. ఇది మనకి బయటకు వచ్చిన లెక్కలు. కాగా, ఏ అధ్యయనాలకు అందిని లెక్కలు, నిజానికి ఇంతకు రెట్టింపు వుంటాయి. కుటుంబ హింస ఇంటి నాలుగు గోడల మధ్య జరిగే హింస. అది శారీరకంగా, మానసికంగా, నిశ్శబ్దంగా, ఒక్కోసారి బాహాటంగా జరుగుతుంది. కుటుంబం వ్యక్తిగత, పవిత్ర వ్యవహారం కాబట్టి, కుటుంబ గుట్టు ఎన్నడూ బయట పెట్టకూడదని, భర్త, పిల్లల కోసం బతకాలని, కుటుంబ గౌరవం, ధర్మాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత స్త్రీలదే అనే బోధనలతో, కుటుంబ హింస, మారిటల్ రేప్ సహజం, అనివార్యం, దానిని అంగీకరించి తీరాల్సినదే అనే స్థితికి స్త్రీలు తీసుకురాబడతారు. మెజారిటీ పురుషులు పెళ్లి ద్వారా తమకి సంక్రమించిన సహజ హక్కు భార్య శరీరం కూడా అని అనుకుంటారు. మన చుట్టూనే, మన ఇరుగు పొరుగు, చివరికి మన ఇళ్ళలో ఇంత హింస జరుగుతున్నా మనం కూడా వాటిని వ్యక్తిగతమైన విషయాలనే పేరిట పట్టించుకోం. 15 ఏళ్లు దాటిన భార్యతో భర్త సెక్స్ జరిపితే దాన్ని అత్యాచారంగా పరిగణించలేమని, సెక్షన్ 375 రేప్ నిర్వచనంలో ఎప్పుడో స్పష్టంగా చెప్పింది. అది ఇప్పుడు 15 నుంచి 18 ఏళ్ల వయసుకి పెరిగింది. అంటే, 18 ఏళ్లు దాటిన స్త్రీ మీద, ఆమె అతనికి భార్య అయితే, ఆ భర్తకి ఆమె పైన అత్యాచారం చేసే హక్కు ఉందన్నమాట. చట్టప్రకారమే కాదు, ఇప్పటి కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రకారం కూడా. మన చట్టాల్లోనూ, మన అవగాహనలోను ఒక వైచిత్రి ఉంది. వివాహ వ్యవస్థ లోపల భర్త, భార్యను కొట్టినా ఆమెను మానసిక, శారీరక హింసకు గురి చేసినా అది ఒక నేరం అవుతుంది. అందుకు కోసం కొన్ని చట్టాలు ఉన్నాయి. కానీ, భర్త భార్యపై అత్యాచారం చేస్తే లైంగికంగా హింసిస్తే అది చట్టపరిధిలోకి రాదు. అది వివాహ సంబంధంలో భార్యా భర్తల మధ్య వుండే సున్నితమైన విషయాలు అట. దీని వెనుక ఉన్న అవగాహన ఏమిటి? అలా ఎందుకు విశ్లేషణలు చేస్తున్నారు అంటే, మన పితృస్వామిక క్షేత్ర బీజ న్యాయం ప్రకారం, స్త్రీ దేహం ఆమెది ఎంత మాత్రం కాదు. కుటుంబ వ్యవస్థ లో పురుషుడికి సుఖాన్ని, అతడి ఆస్తికి వారసులను, కని ఇచ్చే పనికే స్త్రీలు ఉన్నారు. అందుకు అవసరం అయిన లైంగిక చర్యకు వాళ్ళు ఐచ్ఛికంగా ఒప్పుకోకపోతే, బలవంతంగా, హింసను ప్రయోగించి అయినా ఆ పని పురుషులు చేసి తీరవచ్చు. మహిళలపై అత్యధిక హింస ఉన్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై జరిగిన హత్యల్లో 38 నుంచి 50 శాతం హత్యలు వారి భాగస్వామ్య చేశారని లోన్స్ ట్ వారి అంచనా. ద వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్ఒ) లాన్సెట్ అధ్యయనాలు నివేదికల ప్రకారం ఇంటిమేట్ పార్ట్నర్ వయోలెన్స్ (ఐపివి) 2018 నాటికి వివాహంలోనూ వివాహం లేకుండా కూడా సహజీవనం చేస్తునటువంటి మహిళల్లోనూ 15 సంవత్సరాల వయసు ఉన్న వారి దగ్గర నుంచి మొదలుకుంటే 26% వరకు ఉందని దక్షిణాసియా దేశాలలో ఇది 35 శాతంగా ఉందని ఆ ప్రాంతంలో ఉన్న భారత దేశంలో అత్యధికంగా కూడా ఉందని చెబుతుంది. భారతదేశంలో స్త్రీలపై జరుగుతున్న గృహహింస దాదాపు 33 నుంచి 41 శాతం మధ్య ఉంటుందని, ఆత్మహత్య చేసుకున్న గృహిణిల సంఖ్య ప్రపంచంలోని ఇతర మహిళల సంఖ్యతో పోల్చినప్పుడు రెట్టింపు శాతంగా ఉందని ఈ నివేదిక తెలుపుతున్నది. ఇంతటి హింస మన పవిత్ర కుటుంబాలలో జరుగుతూ వుంటే దీన్నంతా సున్నితమైన కుటుంబ సంబంధాలుగా, కేంద్ర ప్రభుత్వం ఎలా చూడగలుగుతుందో మానవ మాత్రులకు అర్థం కావడం కష్టం. ఇప్పటికే అనేక దేశాలు ఒప్పుకున్నా, భారతదేశంలో సహా 36 దేశాలు పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్ అల్జీరియా, బోస్వానా వంటి దేశాలు మారిటల్ రేప్ ని చట్ట పరిధిలోకి తీసుకురావనికి అంగీకరించటం లేదు. ఒక మహిళపై పరాయి పురుషుడు హింస చేస్తే, దాని గురించి మనం మాట్లాడడానికి జంకం. కానీ అదే హింస భర్త చేస్తే దాని గురించి ఆమె కుటుంబం గానీ, ఆమె గానీ, సమాజం గానీ ఎందుకు మాట్లాడదు? ఆర్థికంగా, ఎమోషనల్ గా స్త్రీలను పరాధీనులను చేసి, ఒక పురుషుడిపై ఆధారపడేలాంటి వ్యవస్థలను మనం సృష్టించి, అటువంటి కుటుంబ, వైవాహిక సంబంధాల్ని ఏర్పాటు చేసి, దాంట్లోకి ఆడవాళ్ళని నెట్టి అక్కడ జరిగే హింస గురించి వాళ్లు మాట్లాడకుండా ఉండాలనడం ఏమి ధర్మం? వాళ్లు జీవించడానికి ఏ వ్యవస్థలపై ఆధారపడవలసి వస్తున్నదో, అవే వాళ్ళని హింసించేవిగా తయారు కావడం దాన్ని, స్త్రీలు ప్రశ్నించకుండా ఉండాలి అనడం ఏ రకమైన మానవ హక్కులవుతాయి? అవి రాజ్యాంగా ఉల్లంఘనలు కావా? వాళ్ళు ఈ దేశపు పౌరులు కారా అనే

# నానో కారు వెనక సామాజిక ప్రయోజనం



ముంబై, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నానో కారు ఆవిష్కరణ వెనక కూడా టాటా సేవాదృక్పథం దాగి ఉంది. ఒక సందర్భంలో ఆయన తన ఇన్‌స్టా పోస్టులో ఆ కారు తయారీ వెనక ఉన్న ఆలోచనను పంచుకొన్నారు. నానో లాంటి వాహనాలను తయారుచేయాలన్న కోరిక వెనక నాకు ప్రేరణ ఏంటంటే.. చాలా కుటుంబాలు తరచూ తమ పిల్లలతో కలిసి స్కూటర్లపై వెళ్లడాన్ని నేను చూస్తుండేవాడిని. తల్లీతండ్రి మధ్యలో కూర్చున్న పిల్లలు నలిగిపోతున్నారేమో అని నా మనసుకు అనిపించింది. గుంతలుగా ఉండే రోడ్లపైనా వారు అలాగే ప్రయాణించడం చూసి నాకో ఆలోచన తట్టింది. ముందు మేం ద్విచక్ర వాహనాలను ఎలా భద్రంగా మార్చాలనే దానిపై దృష్టిపెట్టాం. ఆ తర్వాత నాలుగు చక్రాలు ఉండి.. కిటికీలు, డోర్లు లేకుండా కేవలం బగ్గీల్లాంటి వాహనాలను రూపొందించాలను కున్నాం. కానీ చివరకు కారునే తయారుచేయాలని నేను నిర్ణయించుకున్నా. 'నానో' ఎప్పటికీ మన ప్రజల కోసమే అని రతన్ టాటా రాసుకొచ్చారు. వీవీఐపీలు, సెలబ్రిటీలు నిత్యం వచ్చే తాజ్‌మహల్ హోటల్ ప్రవేశ ద్వారం వద్ద వీధి శునకం నిద్రిస్తుండటాన్ని కొన్నాళ్ల క్రితం ప్రముఖ హెచ్ఆర్ నిపుణురాలు రుబీఖాన్ గమనించారు. నాడు హోటల్ సిబ్బందిని అడగ్గా.. 'ఆ శునకం పుట్టినప్పటి నుంచి అక్కడే పెరిగింది. హోటల్‌లో ఓ భాగమైపోయింది. అక్కడికి వచ్చే ఏ మూగజీవాన్నైనా జాగ్రత్తగా చూసుకోవాలని రతన్‌టాటా నుంచి విస్పష్టమైన ఆదేశాలున్నాయి అని వెల్లడించినట్లు రాసుకొచ్చారు. చాలామంది అతిథులు అసలు దానిని గమనించి ఉండరన్నారు. ఇంత గందరగోళం మధ్య కూడా ఆ ప్రదేశాన్ని అది సొంతదిగా భావించిందని ముచ్చటపడ్డారు. ఈ విషయాన్ని నాడు లింక్డ్‌ఇన్‌లో పంచుకొన్నారు. టాటాల వ్యాపార సామ్రాజ్య రాజధానిగా భావించే బాంబే హౌస్‌లోనే వీధి శునకాలకు ఆయన ప్రత్యేకంగా ఉండేందుకు గదులను ఏర్పాటు చేశారు. ఏదైనా శునకం కష్టాల్లో ఉంటే.. దానిని ఎవరైనా దత్తత తీసుకోవాలని ఆయన తన సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి విజ్ఞప్తి చేస్తుంటారు. కొవిడ్‌ను సాకుగా చూపి కంపెనీలు కష్టకాలంలో ఉద్యోగులను వదిలించుకొనే విధానంపై ఆయన గళం విప్పారు. ఓ ఆంగ్ల పత్రికతో నాడు మాట్లాడుతూ.. ఇది నష్టాలు వస్తున్నందుకు కంపెనీలు చేస్తున్నది కాదు.. వారిని రోడ్డున పడేస్తే కంపెనీల సమస్యలు తీరతాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులను తొలగించకుండా సరైన దిశలో ఆలోచించి చర్యలు తీసుకొంటే ఈ కష్టం నుంచి బయటపడొచ్చని పేర్కొన్నారు. కొవిడ్‌తో పోరాడేందుకు ఆయన ఏకంగా రూ.500 కోట్ల నిధులను కేటాయించారు. 26/11 ముంబయి ఉగ్రదాడిలో తాజ్‌మహల్ హోటల్ సిబ్బంది 11 మంది ప్రాణాలు కోల్పోయారు. నాడు స్వయంగా రతన్‌టాటా గాయపడిన, చనిపోయిన వారి కుటుంబాలను సందర్శించి.. వారి పిల్లల చదువు బాధ్యతలను టాటా గ్రూప్ చూసుకొంటుందని భరోసా ఇచ్చారు. చనిపోయిన వారికి మిగిలిన జీవిత కాలంలో ఉద్యోగంలో వచ్చే జీతాన్ని ఆ కుటుబాలకు చెల్లించారు. తాజ్ పబ్లిక్ సర్వీస్ వెల్ఫేర్ గ్రూపును ప్రారంభించారు. రతన్ టాటా తన వద్ద పనిచేసి మానేసిన ఓ ఉద్యోగికి అనారోగ్యంగా ఉందని తెలుసుకొన్నాడు. ఆయనే స్వయంగా ముంబయి నుంచి పుణెకు వెళ్లి ఆ వ్యక్తిని కలిశారు. ఈ విషయం మూడో కంటికి తెలియనీయలేదు. చివరికి లింక్డ్‌ఇన్ పోస్టు ద్వారా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా సంపన్నులు, బిజినెస్ టైకూన్లు కార్లలో వెనక సీట్లలో కూర్చొంటారు. కానీ, రతన్‌టాటా మాత్రం డ్రైవర్ పక్కనే కూర్చొని ప్రయాణాలను ఎంజాయ్ చేస్తారు. ఒక్కోసారి డ్రైవర్ లేకపోతే ఆయనే స్టీరింగ్ వీల్‌ను అందుకొంటారు. విమానాల్లో తరచూ ఆయన ఎకానమీ క్లాస్‌లోనే ప్రయాణిస్తుంటారు. ఆయనతో ప్రయాణికులు కలిసి దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో కనిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో విద్వేషం వ్యాప్తిపై రతన్ టాటా గతంలోనే గళం విప్పారు. ఈమేరకు ఇన్‌స్టాలో పోస్టు పెట్టి తన ఫాలోవర్లు వర్చ్యువల్ బుల్లియింగ్‌కు పాల్పడొద్దని పేర్కొన్నారు. ఇతరులపై అనవసరంగా తీర్పులు ఇవ్వొద్దని యువతకు సూచించారు.

### హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ ,సుప్రీంకోర్టు సౌత్ ఇండియా రీజినల్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్‌తో దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

# కాంగ్రెస్‌ను ఆదుకోలేకపోయిన జవాన్, కిసాన్, పహిల్వాన్..

న్యూఢిల్లీ,ఎగ్జిట్ పోల్స్ అంచనాలు బోర్లాపడ్డాయి. కాంగ్రెస్ కలలన్నీ నీరుగారిపోయాయి. హర్యానా ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభమైన గంటలోనే%ా% అంటే, ఉదయం 9 గంటల ప్రాంతంలో, కాంగ్రెస్ పార్టీ బీజేపీ కంటే చాలా ముందుంది. మరో రాష్ట్రం మన చేతిలోకి వచ్చేసిదంటూ కాంగ్రెస్ వర్గాలు ఉత్సవాలకు ప్రిపేర్ అయిపోయారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జిలేబీలు, ఢోళాలతో సంబరాలు షురూ అయ్యాయి. పదులు సంఖ్యలో లీడ్స్ చూసి, ప్రభుత్వం తమదేనని ఫిక్స్ అయ్యారు. జవాన్, కిసాన్, పహిల్వాన్.. ఓట్లు తమకే అనుకున్నారు. కానీ.. కొన్ని గంటల్లోనే అంచనాలు తారుమారు అయ్యాయి. ఆశలన్నీ అడియాశలయ్యాయి.



డీలా పడ్డారు.. సంబరాలు చేసుకున్నారు

మరోవైపు, బిజేపీ కార్యాలయం బోసి పోయింది. ఎగ్జిట్ పోల్స్ చెప్పినట్లే పదేళ్లు పాలించిన హర్యానా చేజారిపోయిందని బీజేపీ వర్గాలన్నీ ఒక అంచనాకు వచ్చేశారు. సరిగ్గా, మరో గంట తర్వాత వాతావరణం అంతా రివర్స్ అయ్యింది. టీవీ స్క్రీన్లపై పట్టికలు మారుతూ కనిపించాయి. బీజేపీ మళ్లీ గేమ్‌లో నిలిచింది. ఆట అడ్డం తిరిగిన పరిస్థితులు వచ్చాయి. మరో రెండు గంటల తర్వాత, ఎగ్జిట్ పోల్ అంచనాలను భారీ తేడాతో మారుస్తూ హర్యానాలో బీజేపీ బలంగా ముందంజలోకి వచ్చింది. ఇప్పుడు లడ్డూలు, జిలేబీలు, సంబరాలతో బీజేపీ ప్రధాన కార్యాలయం దద్దరిల్లింది.

ఎర్లీ ట్రెండ్స్ తారుమారు

మొదట్లో అంచనా వేసిన స్క్రీన్ పై మలుపు తిరిగింది. ఎర్లీ ట్రెండ్స్ తారుమారు కావడంతో కాంగ్రెస్ నేతలు ఖంగుతిన్నారు. ఆశించిన ఫలితాలు ఆమడ దూరం పరిగెత్తుతుంటే చేసేది లేక చూస్తూ ఉండిపోయారు. అప్పటికే చాలా రౌండ్ల లెక్కింపు మిగిలే ఉంది. కానీ, అప్పటికే సినిమా అందరికీ అర్థమయ్యింది. ఇక, ఈ చిత్రంలో పెద్దగా మార్పు ఏమీ ఉండదని తెలిసిపోయింది. 2019 ఎన్నికల్లో హర్యానాలో కాంగ్రెస్ 31 సీట్లు గెలుచుకుంది. అయితే, ప్రస్తుత ఫలితాల్లోనూ సంఖ్యలు దాదాపుగా అలాగే కనిపించాయి.

అంతర్గత పోరే కారణమా?

కాంగ్రెస్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురుకావడానికి కొన్ని ముఖ్యమైన అంశాలు ప్రభావం చూపించాయి. అందులో అత్యంత ప్రభావం చూపించిన అంశం హర్యానా కాంగ్రెస్‌లో అంతర్గత పోరు. పార్టీలోని అంతర్గత పోరుకు కారణం ఆ పార్టీలోని అగ్రనేతలు అధికారం కోసం తహతహలాడడం. ఎన్నికలకు చాలా ముందు నుంచే కాంగ్రెస్ నేతలు విజయం తథ్యమని భావించి, ముఖ్యమంత్రి పదవి కోసం కసరత్తు ప్రారంభించారు. కాంగ్రెస్‌లో అనుభవజ్ఞుడైన భూపిందర్ సింగ్ హుడా, సీనియర్ నాయకురాలు కుమారి సెల్జా మధ్య అధికార పోరు బహిరంగంగా కనిపించింది. రెండు వర్గాల మధ్య కుమ్ములాటలతో కాంగ్రెస్ ఓట్లు చీలి ప్రత్యర్థులకు అధికారం ఇచ్చాయి.

కొంప ముంచిన హుడా

ఎన్నికలకు ముందు రెండు వర్గాలను కలిపి, విజయాన్ని కట్టబెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం కష్టపడుతున్న తరుణంలోనే ఈ అంతర్గత విభేధాలు పీక్స్‌కెళ్లాయి. దిద్దుబాటు చర్యలకు దిగిన అధిష్టానం, అభ్యర్థులు, పొత్తులో సీట్లు నిర్ణయించడం వంటి అంశాల్లో హుడాకు స్వేచ్ఛ ఇచ్చారు. అయితే, ఇది మరింత అగ్గిని రాజేయడంతో అధిష్టానం అనుకున్న అంచనా తల్లకిందులయ్యింది. వచ్చిన ఫలితాలు చూస్తే ఇది పని చేయలేదని స్పష్టంగా అర్థమయ్యింది.

ఓట్ల షేర్‌లో స్వల్ప తేడా, కానీ..

ఇక, కాంగ్రెస్ ఓటమిలో మరో ప్రధాన అంశం హర్యానాలోని ప్రాంతీయ శక్తులు, ఇండిపెండెంట్లు ప్రతిపక్షాన్ని మరింత కుదేలు చేయడం. ఓట్ల-షేర్‌లో కాంగ్రెస్ బిజెపి కంటే స్వల్పంగా ముందంజలో ఉన్నప్పటికీ, ఈ ఓట్లను సీట్లుగా మార్చడంలో కాంగ్రెస్ పెద్దగా విజయవంతం కాలేకపోయింది. ఫలితాల పోకడలు దాన్ని స్పష్టంగా చూపించాయి. చాలా స్థానాల్లో కాంగ్రెస్ ప్రత్యర్థుల ఆధిక్యం చాలా తక్కువగా ఉంది. ఈ కోణం నుండి చూస్తే%ా% హర్యానాలో అధికార వ్యతిరేక ఓట్లను ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్లు తినేశాయని అర్థమవుతుంది. సరిగ్గా, ఈ పరిస్థితి బిజెపికి ప్రయోజనం చేకూర్చింది.

అదే బీజేపీకి కలిసొచ్చిందా?

పోనీ, ప్రాంతీయ పార్టీలు గానీ, ఇండిపెండెంట్లు గానీ లాభపడ్డాయా అంటే, అవి కూడా విజయం సాధించలేకపోయాయి. ఫలితాలు దాదాపు ఖరారు అయ్యే సమయానికి.. ఐఎన్ఎల్‌డీ, బీఎస్పీ ఒక్కో స్థానంలో ఆధిక్యంలో ఉండగా, నలుగురు స్వతంత్రులు ఆధిక్యంలో ఉన్నారు. ఈ పరిస్థితి కచ్చితంగా బిజేపీకి లాభంగా మారింది. ఇక, హర్యానాలో జాట్ వ్యతిరేక ఏకీకరణ కూడా కాంగ్రెస్ ఓటమికి దారి తీసింది. హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ జాట్ ఓట్లపై దృష్టి సారించగా%ా% బీజేపీకి అనుకూలంగా జాట్-యేతర ఓట్లు.. కౌంటర్ కన్సాలిడేషన్ వ్యూహాన్ని అమలు చేశాయి. ఇది బీజేపీకి బాగా కలిసొచ్చినట్లు స్పష్టంగా కనిపించింది. ఎన్నికలకు ముందు, 'జాట్‌ల ఆధిపత్యం' అనే పదం హర్యానాలో మారు మోగింది. ఇది జాట్ వ్యతిరేక ఓటు బ్యాంక్ ఏకీకరణకు మార్గం వేసింది. అయితే, ఒక్క మాట చెప్పి తీరాలి. ఈ ఫలితాలతో రాష్ట్రంలో ప్రభావవంతమైన సామాజికవర్గ పునరాగమనం సాధ్యమయ్యింది. ఇక్కడ కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ%ా% బదులుగా, జాట్ వ్యతిరేక సంఘాలు అధికార పార్టీ బీజేపీకి అనుకూలంగా ఓటు వేసినట్లు తెలుస్తోంది.

చక్రం తిప్పిన ధర్మేంద్ర ప్రధాన్..

ఇక, రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీజేపీ బ్యాక్ గ్రౌండ్ వర్క్ కూడా కాంగ్రెస్‌కు ప్రతికూల ఫలితాలను తెచ్చిపెట్టింది. ఎన్నికల విశ్లేషకులు కొందరు హర్యానాలో బీజేపీని తప్పుపట్టినప్పటికీ, అన్నింటినీ ఎదుర్కుంటూనే మౌనంగా పని చేసుకుంటూ వెళ్లడం అధికార బీజేపీకి అనుకూలంగా మారింది. కేంద్ర మంత్రి, బిజెపి సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎన్నికల బాధ్యత అప్పగించడంతో పార్టీ ప్రచారం చాలా వ్యూహాత్మకంగా జరిగింది. ముఖ్యంగా కుమారి శైలజా అంశాన్ని బీజేపీ ఎన్నికల్లో ఎక్కువగా ప్రస్తావిస్తూ వచ్చింది.

కుమారి శెల్జాను పక్కన పెట్టండం

కుమారి శైల్జా కోరుకున్నప్పటికీ అసెంబ్లీ టిక్కెట్ రాకపోవడం, సన్నిహితులకు తక్కువ టిక్కెట్లు రావడంతో బీజేపీ దీన్ని అస్త్రంగా చేసుకుని ఎదురుదాడికి దిగింది. దళిత నేతలను కాంగ్రెస్ గౌరవించదన్న స్పష్టమైన సందేశం ఇచ్చే ప్రయత్నం చేసింది. ఈ విషయంపై స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ కూడా విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి కౌంటర్‌గా రాజ్యాంగాన్ని మార్చే కథనాన్ని కాంగ్రెస్ ఎలా అమలు చేసిందో.. శెల్జా అంశాన్ని కూడా బీజేపీ తన కౌంటర్ కథనంగా ఉపయోగించుకుంది. దీంతో, బీజేపీ మళ్లీ ఒకసారి కాంగ్రెస్ నుంచి విజయాన్ని లాగేసుకుంది.

ఆత్మ పరిశీలన చేసుకోవల్సిందే..

హర్యానాలో కాంగ్రెస్‌కు గ్రామీణ ఓటు బ్యాంక్ ఆసరాగా నిలిచినా%ా% పట్టణాల్లో బీజేపీ ఆధిపత్యం కొనసాగించింది. గత పదేళ్లలో, బీజేపీ, హర్యానాలోని గుర్గావ్, ఫరీదాబాద్ వంటి సిటీల్లో మద్దతును భారీగా కూడగట్టింది. అనుకున్నట్లే సిటీ ఓటును కొట్టేసింది. అయితే, కాంగ్రెస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో మంచి మద్దతు లభించినప్పటికీ%ా% గ్రామీణ సీట్లలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయలేకపోయింది. జవానులు, రైతులు, ఫహిల్వాన్‌లు అండగా ఉంటారని ఆశించినప్పటికీ అనుకున్నంత రాబట్టలేకపోయింది. ఇప్పుడు హర్యానాలో బీజేపీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యింది. ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న దారి ఒక్కటే%ా% హర్యానాలో తమకు ఉంటుందనుకున్న ప్రజా మద్దతును ఎందుకు ఓట్లుగా మార్చుకోలేకపోయారో ఆత్మపరిశీలన చేసుకోవడం.

# సాదాసీదా జీవితం రతన్‌టాకే సొంతం

ముంబై, దేశ చరిత్రలో అక్టోబర్ 9 ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎందుకంటే వేల కోట్లు, వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్వహించిన రతన్ టాటా లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. మీకు అవకాశాలు వస్తాయని ఎదురుచూడకండి, మీ స్వంత అవకాశాలను సృష్టించుకోండి అంటూ టాటా గ్రూప్ సామ్రాజ్యాన్ని విస్తరించిన అసామాన్యుడు రతన్ టాటా. రతన్ టాటా ఎలాంటి శ్రమైకజీవుడో తెలియడానికి రతన్ టాటా నోటి నుండి ఈ ఒక్క మాట చాలు. రతన్ టాటా కంపెనీ టాటా మోటార్స్ ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన కార్లలో ఒకటైన 'జాగ్వార్', 'ల్యాండ్ రోవర్'లను తయారు చేస్తోంది. ప్రపంచంలో ఏ కారునైనా కొనగలిగేంత సంపద అతని వద్ద ఉంది. కానీ ఆయన చివరి రోజుల్లో ఎప్పుడూ నానో కారులో ప్రయాణించారు! కొన్ని రోజుల క్రితం, అతను ఆసుపత్రిలో చేరినట్లు వార్తలు రావడంతో, ప్రజలు అతని మరణంపై ఊహాగానాలు వెల్లువెత్తాయి. అయితే ఆయనే స్వయంగా తన అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా ఖండించారు. ఆ తర్వాత అదే నిజమైంది. అనుహ్యంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. దాదాపు 3 దశాబ్దాల పాటు టాటా గ్రూపునకు నేతృత్వం వహించిన రతన్ టాటా తన చివరి క్షణాలను 'బక్తవార్' అనే ఇంట్లో గడిపారు. ఈ ఇంటిని ఒక్కసారి చూస్తే, ఇందులో ఐశ్వర్యం జాడ కనిపించదు. రతన్ టాటా ఇల్లు ముంబైలోని కొలాబా ప్రాంతంలో ఉంది. 'భక్తవర్' అంటే అదృష్టాన్ని తెచ్చేవాడు. ఇది రతన్ టాటా జీవితాంతం వర్తిస్తుంది. టాటా గ్రూప్‌నకు అధికారంలో ఉన్నప్పుడు, అతను మొత్తం గ్రూపునకు అదృష్టాన్ని తెచ్చే అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో లండన్ స్టీల్ కంపెనీ 'కోరస్', టీ కంపెనీ 'టెట్లీ'లను కొనుగోలు చేయడం జరిగింది. రతన్ టాటా తన చివరి క్షణాలు గడిపిన 'భక్తవర్' ఇంట్లో అతని ప్రత్యక్ష ప్రభావం కనిపిస్తుంది. ఇల్లు సముద్రానికి ఎదురుగా ఉంటుంది. సరిగ్గా కోలాబా పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉంది. దీని వైశాల్యం 13,350 చ.అ. ఈ బంగ్లాలో 3 అంతస్తులు, 10-15 కార్లు పార్కింగ్ స్థలం ఉంది. ఈ ఇల్లు చాలా సులభమైన, పరిపూర్ణ డిజైన్‌తో రూపొందించారు. ఇది పూర్తిగా తెల్లగా పెయింట్ చేయడం జరిగింది. ఇంట్లో సూర్యరశ్మి పుష్కలంగా ఉండేలా పెద్ద కిటికీలు ఉపయోగించారు. ఇవి ఇంటి లివింగ్ రూమ్ నుంచి పడకగది వరకు కనిపిస్తాయి. మొత్తంగా చెప్పాలంటూ చాలా సింపుల్ ఇంట్లో చివరి వరకు నివసించారు రతన్ టాటా..

# అంచెలంచెలుగా ఎదిగిన రతన్ టాటా

ముంబై,రతన్ టాటా 1937 డిసెంబరు 28వ తేదీన నావల్ టాటా, సోనూలకు రతన్ టాటా ముంబైలో జన్మించారు. 8వ తరగతి వరకు ఆయన ముంబయిలోని కాంపియన్ పాఠశాలలో చదివారు. ఆ తరువాత కేథడ్రల్ అండ్ జాన్ కానన్ పాఠశాలలో చదువు కొనసాగించారు. శిమ్లాలోని బిషప్ కాటన్ పాఠశాలలోనూ చదివారు. 1955లో న్యూయార్క్‌లోని రివర్‌డేల్ కంట్రీ స్కూల్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తరువాత కార్నెల్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చురల్ ఇంజినీరింగ్‌లో పట్టా అందుకున్నారు. అనంతరం హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో చేరి అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశారు. 1948లో ఆయన తల్లిదండ్రులు విడిపోయిన తర్వాత అమ్మమ్మ నవాజ్‌బాయి టాటా వద్ద పెరిగారు. రతన్ టాటా ఇప్పటికీ అవివాహితుడు. నాలుగుసార్లు పెళ్లి దాకా వచ్చారు కానీ మూడు ముళ్ల బంధంతో ఒక్కటి కాలేదు. లాస్ ఏంజెల్స్‌లో ఉన్నప్పుడు ఒకమ్మాయితో ప్రేమలో పడ్డాను అని టాటా చెప్పారు. 1962 ఇండో-చైనా యుద్ధం కారణంగా ఆమె తల్లిదండ్రులు ఇండియాకు పంపించేందుకు అంగీకరించ లేదు. అలా లవ్ మ్యారేజ్‌కు బ్రేక్ పడిందని తెలిపారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు ముని మనవడైన రతన్ టాటా ముంబైలో జన్మించారు. తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా.. ఆయన పుట్టిన పదేళ్లకు విడిపోయారు. ఇది కూడా టాటా జీవితంలో ఓ విషాదకరంగా మిగిలిపోయింది. ముంబై, సిమ్లాల్లో కొంతకాలం చదివిన అనంతరం.. ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికాకు వెళ్లారు. అమెరికాలోని రివర్‌డేల్ కంట్రీ హైస్కూల్‌లో పట్టా పుచ్చుకున్న అనంతరం కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ అండ్ స్ట్రక్చురల్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1959లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న రతన్ టాటా.. 2008లో అదే కార్నెల్ యూనివర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళం ఇచ్చారు. ఆ విశ్వవిద్యాలయ చరిత్రలోనే అతిపెద్ద అంతర్జాతీయ దాతగా నిలిచారు. అమెరికాలో పట్టభద్రుడైన అనంతరం.. 1961లో ఆయన టాటా గ్రూపులో చేరారు. తొలుత టాటా స్టీల్‌లో చిరుద్యోగిగా చేరిన ఆయన గ్రూపులోని వివిధ కంపెనీల్లో విభిన్న హోదాల్లో పనిచేశారు. 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్‌చార్జిగా.. 1981లో టాటా ఇండస్ట్రీస్ చైర్మన్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారు. రెండేండ్లు తిరిగే సరికి 1983లో సాల్ట్ ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. తొలిసారిగా అయోడైజ్డ్ ఉప్పును ప్రవేశపెట్టారు. టాటా నామక్ దేశ్ కా నామక్ ప్రచారంతో వినియోగదారులను విశేషంగా ఆకట్టుకున్నారు. 1991లో జేఆర్‌డీ టాటా నుంచి టాటా సన్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1990 నుంచి 2012 వరకు టాటా గ్రూప్‌నకు చైర్మన్‌గా ఉన్నారు. మళ్లీ అక్టోబర్ 2016 నుంచి ఫిబ్రవరి 2017 వరకు తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరించారు. 1962లో టాటా స్టీల్‌లో చేరడం ద్వారా తన వృత్తి జీవితాన్ని రతన్ టాటా ప్రారంభించారు. 1991లో టాటా సన్స్ ఛైర్మన్‌గా జేఆర్‌డీ టాటా వైదొలగారు. రతన్ టాటాను వారసుడిగా ప్రకటించారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రతన్ టాటా.. సంస్థను భారీగా విస్తరించారు. పేదవాడి కారైన టాటా నానోతోపాటు టాటా ఇండికా కార్లను మార్కెట్‌కు పరిచయం చేశారు. 2012 డిసెంబరు 28న తన 75వ పుట్టిన రోజునాడు టాటా సన్స్ ఛైర్మన్ పదవి నుంచి రతన్ టాటా వైదొలగారు. సైరస్ మిస్త్రీని ఛైర్మన్ చేశారు. టాటా గ్రూప్ ఛైర్మన్‌గా21 ఏళ్లపాటు రతన్ టాటా పని చేశారు. గ్రూప్‌ను భారీగా విస్తరించడంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. ఆయన హయాంలో గ్రూప్ ఆదాయం 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. 2016 అక్టోబరు 24వ తేదీన మిస్త్రీని తొలగించి మళ్లీ రతన్ టాటా, టాటా గ్రూప్‌నకు తాత్కాలిక ఛైర్మన్ అయ్యారు. 2017 జనవరి 12వ తేదీన నటరాజన్ చంద్రశేఖరన్‌ను గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్ ఛైర్మన్‌గా నియమించారు. అప్పటి నుంచి రతన్ టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. పదవీ విరమణ తర్వాతా రతన్ టాటా వ్యాపారంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన వ్యక్తిగత హోదాలో 30 అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. అందులో ఓలా ఎలక్ట్రిక్, పేటీఎం, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్, జివామే వంటివి ఉన్నాయి. దేశంలో ఆర్థిక సంస్కరణల సమయంలో టాటా గ్రూపును రతన్ టాటా పునర్వ్యవస్థీకరించారు. అదే సమయంలో స్థానికంగా రూపొందించిన టాటా నానో, ఇండికా కార్లను విడుదల చేసి, సంచలనం సృష్టించారు. 2004లో టీసీఎస్ పబ్లిక్ ఇష్యూ తీసుకొచ్చారు. అంతర్జాతీయంగానూ టాటా గ్రూపును విస్తరించడంలో రతన్ టాటా కృషి ఎనలేనిది. ఆంగ్లో-డచ్ స్టీల్ కంపెనీ కోరస్‌ను టేకోవర్ చేశారు. బ్రిటిష్ వాహన దిగ్గజం జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేశారు. బ్రిటిష్ టీ కంపెనీ టెట్లీనీ కొన్నారు. 991లో 5.7 బిలియన్ డాలర్లుగా ఉన్న టాటా గ్రూపు సంపదను 2016 నాటికి 103 బిలియన్

# రతన్ టాటా మరణంతో దేశమంతా శోకతప్తం

ముంబై, దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మరణం ప్రతిఒక్కరినీ ఎంతగానో బాధిస్తోంది. ఇక చివరిదశలో టాటాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి శంతను నాయుడు. రతన్‌టాటాతో ఆ యువకుడి స్నేహం అందరినీ ఆశ్చర్యపర్చింది. టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైనా జనరల్ మేనేజర్‌గా, టాటాకు అత్యంత విశ్వాసపాత్రుడైన అసిస్టెంట్‌గా వ్యవహరించిన శంతను.. ఈ మరణంపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్ అని రాసుకొచ్చారు. మీ నిష్క్రమణతో మన స్నేహంలో శూన్యం మిగిలింది. ఆ లోటును అధిగమించడానికి ఈ జీవితాంతం ప్రయత్నిస్తాను. ఈ ప్రేమ దూరమవడంతో కలుగుతోన్న దుఃఖం పూడ్చలేనిది. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్' అని ఈ 30 ఏళ్ల శంతను ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే ఇద్దరు కలిసిదిగిన ఒక పాత చిత్రాన్ని షేర్ చేశారు. శంతను 2018 నుంచి రతన్‌టాటాకు అసిస్టెంట్‌గా ఉంటున్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. 80ల్లో ఉన్న టాటాకు.. ఈ యువకుడికి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. వీరిద్దరిని కలిపింది వీధి శునకాలపై ఉన్న ప్రేమే. పెద్ద వయస్కులతో స్నేహం వల్ల కలిగే ప్రయోజనాలు, వృద్ధాప్యంలో వారిపై చూపాల్సిన ఆప్యాయత.. రతన్‌జీతో స్నేహం వల్లే తనకు తెలిసిందని శంతను ఓ సందర్భంలో వెల్లడించారు. ఆ ఆలోచనలో నుంచి పుట్టినదే 'గుడ్‌ఫెల్లోస్' అనే అంకుర సంస్థ. పిల్లలకు దూరంగా ఉన్న వయసు మళ్లిన వృద్ధులకు ఆసరాను అందించే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. దీనిలో టాటా పెట్టుబడులు కూడా పెట్టారు. 'గుడ్ ఫెల్లోస్' లాంచింగ్ కార్యక్రమంలో రతన్‌టాటా మాట్లాడుతూ.. 'ఒక తోడుంటే బాగుండు అని కోరుకుంటూ ఒంటరిగా సమయం గడిపేవరకూ.. ఒంటరితనం అంటే ఎలా ఉంటుందో తెలియదు' అని వ్యాఖ్యానించారు. అలాగే వాస్తవంగా వయసు మళ్లేవరకు.. వృద్ధాప్యం గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరన్నారు. ప్రస్తుతం సహజ సత్సాంగత్యాన్ని పొందడం అత్యంత సవాలుగా ఉందని వెల్లడించారు. ఆ సందర్భంగా శంతను ఆలోచనా విధానాన్ని మెచ్చుకున్నారు.

# ఫలితాన్ని ఎలా చూడాలి?

జమ్మూ కశ్మీర్ ,మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితం ఇప్పుడు ఆసక్తికరంగామారింది. ఎందుకంటే.. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాదని.. హంగ్ ఖాయమని స్పష్టం చేశారు. అయితే.. అనూహ్యంగా స్పష్టమైన తీర్పును ఓటర్లు ఇచ్చేశారు. 90 స్థానాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్ని సొంతం చేసుకొని పరభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటూ ఉంటే.. బీజేపీ 29 స్థానాల వద్దే ఆగి పోయింది. ఎన్ సీకి మిత్రుడైన కాంగ్రెస్ కేవలం ఆరు స్థానాలకే పరిమిత మైంది. ఒకప్పుడు బీజేపీకి జట్టు కట్టి ఆ తర్వాత కటీఫ్ చెప్పిన పీడీపీ కాంగ్రెస్ కంటే దారుణంగా మూడు స్థానాలకే పరిమితమైంది. జేపీసీ.. సీపీఎం.. ఆప్ పార్టీలు ఒక్కో స్థానంలో.. ఇండిపెండెంట్ అభ్యర్థులు ఏడు స్థానాల్లో విజయం సాధించారు.ఈ ఎన్నికల ఫలితాల్నివిశ్లేషించే ముందు ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ఆసక్తికరంగా మారింది. బీజేపీ 25.64 శాతం ఓట్లతో తక్కువ స్థానాల్ని సొంతం చేసుకుంటే.. నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం 23.43 శాతం ఓట్లతో ఎక్కువ సీట్లను సొంతం చేసుకోవటమే కాదు.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి. ఎందుకిలా? అంటే.. బీజేపీ తనకు పట్టున్న జమ్ము ప్రాంతంలోని అభ్యర్థులు పెద్ద ఎత్తున మెజార్టీని సొంతం చేసుకున్నారు. దీంతో.. ఓట్ల శాతం బీజేపీవైపు ఉన్నా.. సీట్లు గెలుచుకునే విషయంలో మాత్రం కమలనాథులు వెనుకబడిపోయారు.గతంలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే బీజేపీ తన ఓట్ల శాతాన్ని పెంచుకోగలిగింది. సీట్లను మెరుగుపర్చుకోగలిగింది. అయితే.. కొత్త కశ్మీర్.. శాంతియుత కశ్మీర్.. లాంటి నినాదాలు కశ్మీరీలకు ఎక్కలేదు. ఆర్టికల్ 370 పునరుద్దరణ (జరిగే అవకాశం లేకున్నా).. రాష్ట్ర హోదానే వారికి ప్రాధాన్యతగా మారాయి. అందుకే.. కశ్మీర్ లో బీజేపీ తన పట్టును ప్రదర్శించలేకపోయింది. సంప్రదాయంగా తనకున్న బలమున్న జమ్ములో బీజేపీ తాను అనుకున్నట్లే ఫలితాల్ని సొంతం చేసుకోగలిగినా..కశ్మీర్ లో మాత్రం ఏ మాత్రం అనుకూల ఫలితాలు రాలేదు.అదే సమయంలో నేషనల్ కాన్ఫరెన్స్.. కాంగ్రెస్ ల ఇండియా కూటమి ఘన విజయాన్ని సాధించింది. 47సీట్లు ఉన్న కశ్మీర్ లోయలో బీజేపీ ప్రభావం చాలా తక్కువగా కనిపించింది. అదే సమయంలో జమ్ములో తన వ్యూహం ఫలించి.. కశ్మీర్ రాజదండం చేతికి వస్తుందన్న అంచనాలు తప్పాయి. జమ్ములో మొత్తం 43 సీట్లు ఉండగా.. బీజేపీకి వచ్చిన మొత్తం 29 స్థానాల్ని చూస్తే.. జమ్ము ప్రజల మనసుల్ని దోచుకోవటంలోనూ తడబడినట్లుగా కనిపిస్తుంది.తమకు రాష్ట్ర హోదా లేకుండా చేసిన బీజేపీపై కశ్మీరీలు గుర్రుగా ఉన్నరన్న విషయం ఈ ఎన్నికల్లో అర్థమైందని చెప్పాలి. కొత్త కశ్మీర్ ను స్రష్టిస్తున్నామని.. శాంతిభద్రతలు.. డెవలప్ మెంట్ మీద ఫోకస్ చేసినట్లుగా.. సంపద పెంచినట్లుగా చెప్పినప్పటికీ వాటిని ఓట్లుగా మలుచుకోవటంలో బీజేపీ ఫెయిల్ అయ్యింది. అంతేకాదు.. సయ్యద్ అల్తాఫ్.. బుఖారీకి చెందిన ఆప్నీ పార్టీతో పాటు సజ్జాద్ లోన్ కు చెందిన పీపుల్స్ కాన్ఫరెన్స్ తో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పార్టీ కోరుకున్న గెలుపు సొంతం కాలేదు. కనీసం హంగ్ ఏర్పడినా.. శాశ్విత ఎమ్మెల్యేల అండతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయింది.నేషనల్ కాన్ఫరెన్స్.. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీలు కశ్మీరీల గౌరవం పేరుతో చేసిన ప్రచారం బీజేపీని కశ్మీర్ వ్యతిరేకిగా ముద్ర వేయటంలో విజయం సాధించాయని చెప్పాలి. కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిన తర్వాత కశ్మీర్ కు భారీ ఎత్తున పెట్టుబడులు పెడతామని.. ఉద్యోగాలు వస్తాయని చెప్పిన బీజేపీ చేతల్లో అంత చేసి చూపించలేకపోయింది. ఇది కూడా ఒక లోటుగా చెప్పాలి. లోయలోని ఓటర్లు బీజేపీని ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్న విషయం తాజా ఎన్నికల ఫలితంతో మరోసారి నిరూపితమైందని చెప్పాలి. కశ్మీర్ రాష్ట్ర హోదా డిమాండ్ రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యతను సంతరించుకోవటంతోపాటు.. కేంద్రంలోని మోడీ సర్కారుకు కొత్త సవాళ్లను తెచ్చి పెడుతుందని మాత్రం చెప్పక తప్పదు.

# చెట్టును ఢీకొట్టిన కారు

నారాయణపేట : కారు చెట్టును ఢీకొట్టగా భారీగా మంటలు ఎగిసిపడ్డ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలో గురువారం ఉదయం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి మంత్రాలయంకు బయలుదేరిన కారు మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టడంతో కారులో వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి. అదృష్టవశాత్తు కార్ డోర్లు సకాలంలో ఓపెన్ కావడంతో అందులో పయనిస్తున్న కుటుంబ సభ్యులు బయట పడి ప్రాణాలు దక్కించుకున్నారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు సంఘటన స్థలానికిచేరుకొని మంటలను ఆర్పేశారు.

# కోట్ల పేదలకు రేషన్ పరేషాన్



హైదరాబాద్,ఆహార భద్రతలో భాగంగా దేశవ్యాప్తంగా ఉచితంగా బియ్యం/ ఆహార ధాన్యాలు అందించేందుకు ఉద్దేశించిన ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై)తో పాటు సంబంధిత పథకాలను కేంద్రం 2028 డిసెంబర్ వరకు పొడిగించింది. ఈ మేరకు తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి కోసం రూ. 17,082 కోట్లు ఖర్చు చేయడానికి నిర్ణయించారు. ఈ నిర్ణయం ఎంతో ఆశలు కలిగిస్తోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తే దేశంలోని రేషన్ కార్డులేని పేదలు దాదాపు 8 కోట్ల మంది ఉన్నారు. గత కొన్నేళ్లుగా వీరికి రేషన్ కార్డులు లేక ప్రజాపంపిణీ వ్యవస్థ కింద ఎలాంటి ఆహార ధాన్యాలు సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో ఈనెల (అక్టోబర్)4న దాఖలైన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది.అంతేకాదు రేషన్ కార్డుల జారీకి చివరి అవకాశంగా నవంబర్ 19వ తేదీ వరకు సమయం ఇస్తున్నామని గడవు విధించడం గమనార్హం. దీన్ని బట్టి పేదలకు రేషన్ సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఎంతవరకు శ్రద్ధ వహిస్తోందో తేటతెల్లమవుతోంది. గత ఆగస్టులో జరిగిన వ్యవసాయ ఆర్థిక వేత్తల జాతీయ సదస్సులో ప్రధాని మోదీ దేశంలో అవసరానికి మించి ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయని గొప్పగా ప్రకటించా రు. మరి అలాంటప్పుడు 8 కోట్ల మందికి ఎందుకు రేషన్ సరఫరా చేసే చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్న ఎదురవుతోంది. ప్రపంచ ఆకలి సూచికలో భారత్ స్థానం రానురానూ దిగజారుతోందన్న వాస్తవం సర్వేల ద్వారా బయటపడుతోంది. 2016లో 97వ స్థానంలో ఉన్న భారత్, 2023లో 111వ స్థానానికి (మొత్తం దేశాలు 125) పడిపోయింది.2021లో నిర్వహించిన ఓ సర్వేలో దేశంలో 74.1% మందికి ఆరోగ్యకరమైన ఆహారం లభించడం లేదని తేలింది. ఈ పరిస్థితుల్లో ఆహారధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రకటించుకోవడంలో ప్రయోజనం ఏముందో అర్థం కావడం లేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రచార సభల్లో ప్రధాని మోదీ తమ ప్రభుత్వం పేదలకు ఉచితంగా రేషన్ అందిస్తున్నట్టు పదేపదే ప్రకటించారు. కానీ వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. దేశంలోని 8 కోట్ల మంది పేదలకు రేషన్‌కార్డులు లేవని గత సంవత్సరం ఆగస్టులో సుప్రీం కోర్టుకు కేంద్రం విన్నవించింది. దీన్ని బట్టి పిఎంజికెఎవై పథకంలో ఈ ఎనిమిది కోట్ల మంది లేరని, వారికి రేషన్ అందడం లేదని స్పష్టమవుతోంది. 2013వ సంవత్సరపు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద దేశ జనాభాలో మూడింట రెండొంతుల (67%) మందికి ప్రయోజనం చేకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గ్రామీణ జనాభాలో 75% మందికి, పట్టణ జనాభాలో 50% మందికి సబ్సిడీపై ఆహార ధాన్యాలు సరఫరా చేయాలన్నది ప్రభుత్వ లక్షం.కానీ ఈ మేరకు చర్యలు మాత్రం కనిపించడం లేదు.2020లో కొవిడ్ మహమ్మారి విజృంభించిన గడ్డు పరిస్థితిలో పిఎంజికెఎవై పథకం కింద అదనంగా ఐదు కిలోల ఆహార ధాన్యాలను ప్రజాపంపిణీ లబ్ధిదారులకు అందజేశారు. అయితే 2023 జనవరి నుంచి ఉచిత పంపిణీ ఆగిపోయింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఒక్కో వ్యక్తికి గతంలో సబ్సిడీ రేటుపై ఇచ్చే ఐదు కిలోలనే ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. ఈ పథకాన్ని సవరించి ఈ ఏడాది జనవరి నుంచి మరో ఐదు సంవత్సరాలు పొడిగించారు. అయితే 2011లో సేకరించిన జనాభా లెక్కల ఆధారం గానే ప్రస్తుత ప్రజాపంపిణీ వ్యవస్థ కోటా నిర్ణయమవుతోంది. ఫలితంగా అనేక మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా పొందలేకపోతున్నారు. 2011నాటి జనాభా లెక్కలబట్టి కాకుండా ప్రస్తుత జనాభాను గణించి ఆ మేరకు రేషన్ కోటా పెంచాలని సుప్రీం కోర్టు ప్రభుత్వానికి ఆదేశించింది. అయినా నిమ్మకునీరెత్తినట్టు కేంద్రంలో ఎలాంటి కదలికలు కనిపించడం లేదు.గత జులైలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని సుప్రీంకోర్టు తూర్పారబట్టింది. ఉదాహరణకు కర్ణాటకలో 1.45 లక్షల మంది అర్హులైన లబ్ధిదారులు రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తుంటే ఇప్పటి వరకు కేవలం 13,945 కార్డులు మాత్రమే జారీ కావడం గమనార్హం. ఇదిలా ఉండగా రేషన్ కార్డులు పొందాలంటే అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డులున్న 81 కోట్ల మంది ఈకెవైసి ద్వారా బయోమెట్రిక్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ఇటీవలనే ఆదేశాలు జారీ చేసింది. 99.8% రేషన్ కార్డులు ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానమైనప్పుడు ఈ కెవైసి అవసరం ఏముంటుంది అన్నదే ప్రశ్న. ఈ కెవైసిని పూర్తి చేయకపోతే రేషన్ కార్డులు రద్దవుతాయని చౌక డిపోల నుంచి లబ్ధిదారులకు హెచ్చరికలు అందుతున్నాయి. ఒకవైపు జనాభా గణనను వాయిదా వేయడమే కాకుండా సుప్రీం కోర్టు తీవ్రంగా హెచ్చరించినా కోట్ల మంది పేదలకు రేషన్ అందించడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనతకు ప్రత్యక్ష నిదర్శనం.

### ఆక్రమణల ఫిర్యాదుపై అధికారుల విచారణ

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36 నాలా ఆక్రమణకు గురైందనే ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విచారణ చేపట్టారు. జూబ్లీహిల్స్‌లో కొన్నిచోట్ల నాలా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, మరికొన్ని ప్రాంతాల్లో నాలా కుంచించుకుపోయిందని హైడ్రాకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇందులో వాస్తవాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా జీహెచ్‌ఎంసీని కోరింది.

# జంపింగ్‌లపై డబుల్ గేమ్!

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఫిరాయింపుదారుల చట్టం ఆ పార్టీనే అభాసుపాలు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిరాయింపుల విషయంలో రాష్ట్రానికొక తీరుగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక జాతీయ పార్టీ ఇట్లా చేయడం కరెక్టు కాదని పలువురు కాంగ్రెసేతర పార్టీల నేతలు అంటున్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన ఫిరాయింపుల వ్యవహారంలో, హిమచలప్రదేశ్‌లో జరిగిన ఫిరాయింపుల వ్యవహారంలో కాంగ్రెస్ శైలిలో వ్యత్యాసం కనిపించింది. ఫిరాయింపుదారులకు పింఛన్, ఇతర అలవెన్స్‌లు కూడా రద్దు చేయాలని హిమాచలప్రదేశ్ అసెంబ్లీలో ఒక చట్టం కూడా తీసుకువచ్చారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో మాత్రం కోర్టు తీర్పును సైతం పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక.. ఈ తీర్పును కూడా పరిగణనలోకి తీసుకోకుండా పక్కదారులను వెతుకుతుండడం పలు విమర్శలకు దారితీసింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పది మంది వలస

బీఆర్ఎస్ బీఫారం ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్‌రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని స్వయంగా ముఖ్యమంత్రి, అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి సార్థ్యంలో పార్టీలో చేరారు. వారి బాటలోనే మరో ఏడుగురు ఎమ్మెల్యేలు పయనించారు. ఈ క్రమంలో ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపుదారులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఒక అడుగు ముందుకు వేసి హైకోర్టును ఆశ్రయించారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు..

లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేశారు. ఆయన బాటలోనే మరో తొమ్మిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. అయితే.. వీరిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ అనర్హత పిటిషన్‌లు దాఖలు చేసినప్పటికీ, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేసే పద్ధతులను అవలంభిస్తోంది. దీంతో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆకేలపూడి గాంధీపై అనర్హత వేటు పడకుండా ఉండేందుకు కాంగ్రెస్ జాగ్రత్త పడింది. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పబ్లిక్ అకౌంట్ కమిటీ చైర్మన్ పదవిని గాంధీకి కట్టపెట్టింది. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పెద్ద యుద్ధమే జరిగింది.

ముగ్గురిపై అనర్హత వేటు కోసం..

ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్‌రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ హైకోర్టులో బీఆర్ఎస్ పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌ను స్పీకర్ ముందు ఉంచాలని రాష్ట్ర శాసనసభ కార్యదర్శిని హైకోర్టు సెప్టెంబర్ 9న ఆదేశించింది. నాలుగు వారాల్లోగా ఏమీ చర్యలు తీసుకున్నారో షెడ్యూల్‌తో కూడిన స్టేటస్ రిపోర్ట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్‌కు తెలియజేయాల్సి ఉంటుందని, అలా చేయని పక్షంలో కోర్టు ఈ కేసును తిరిగి విచారణకు తీసుకుంటుందని కోర్టు తెలిపింది. నాలుగు వారాల గడువు సమీపిస్తున్న తరుణంలో.. సింగిల్ జడ్జి బెంచ్ ఉత్తర్వులను సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి గత వారం హైకోర్టును ఆశ్రయించారు. అయితే.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించి తదుపరి విచారణను అక్టోబర్ 24కి వాయిదా వేసింది. కాగా, హైకోర్టు ఉత్తర్వులతో ఫిరాయింపులు నిలిచిపోయాయని చెప్పొచ్చు.

ప్రజాశాంతి పార్టీ మరో పిటీషన్



పార్టీ ఫిరాయింపు చేసిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ మరో పిటీషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ కార్యదర్శి, భారత ఎన్నికల సంఘంతో పాటు పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

హిమచల్ ప్రదేశ్‌లో ఇలా..

ఈ ఏడాది ప్రారంభంలో హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీలోకి ఫిరాయించిన ఆరుగురు ఎమ్మెల్యేలపై అధికార కాంగ్రెస్ అనర్హత వేటు వేసింది. సెప్టెంబరులో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఫిరాయించిన శాసన సభ్యుల పెన్షన్ ప్రయోజనాలను రద్దు చేయడానికి హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ఒక చట్టాన్ని కూడా తీసుకువచ్చింది.

గోవాలో కూడా..

గోవాలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి ఫిరాయించారు. బీజేపీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలు రెండేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో గత నెలలో కాంగ్రెస్ నిరసనలు నిర్వహించింది. వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేసింది.

రాష్ట్రానికో తీరు.. హైకమాండ్ తీరుపై విమర్శలు..

కాంగ్రెస్ జాతీయ పార్టీ అనే విషయాన్ని మరిచిపోయి రాష్ట్రానికో విధంగా వ్యవహరిస్తోందని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్, హిమచల్‌ప్రదేశ్‌లో ఫిరాయింపుదారులపై వేటు వేసింది. అలాగే.. పెన్షన్ ప్రయోజనాలను రద్దు చేస్తూ అసెంబ్లీలో కొత్త చట్టాన్ని కూడా తీసుకు వచ్చింది. ఆయా రాష్ట్రాల్లో కఠినంగా ఉన్న కాంగ్రెస్ పెద్దలు.. తెలంగాణలో హైకోర్టు ఆదేశించినా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పక్కదారులను వెతకడంపై మిగిలిన పార్టీలు దుమ్మెత్తిపోస్తున్నాయి. జాతీయపార్టీగా ఉన్న కాంగ్రెస్ అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా వ్యవహరిస్తే ప్రజలు కూడా హర్షిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి.

బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పది మంది వలస

బీఆర్ ఎస్ బీఫారం ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్‌రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని స్వయంగా ముఖ్యమంత్రి, అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. వారి బాటలోనే మరో ఏడుగురు ఎమ్మెల్యేలు పయనించారు .ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూ డి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అ యితే, బీఆర్ఎస్‌ను జీరో చేస్తామని, అసలు ఆ పార్టీ అంటూ ఉండదని, ఆ పార్టీలో ఉండి చేసేదేమీ లేదని కాంగ్రెస్‌లో చేరండి అని కాంగ్రెస్ పెద్దలు ఇల్లిల్లూ తిరిగి ఆహ్వానాలు పలికారు.

# అక్రమంగా గృహ నిర్బంధం చేసే అధికారం కాంగ్రెస్‌కు లేదు

హైదరాబాద్ : హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేసే అధికారం లేదని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం సాగుతున్నదని ధ్వజమెత్తారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ నేపథ్యంలో ప్రతిపక్ష పారీలు నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సెంట్రల్ జోన్ డీసీపీ, చిక్కడపల్లి ఏసీపీ ఆదేశాల మేరకు ముషీరాబాద్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముఠా జైసింహ, ఆయన అనుచరులను గాంధీనగర్‌లోని నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను చూసి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కారణం చూపకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో బుధవారం తాను అనేక అమ్మవారి పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండగా, పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేయడంతో తన అభిమానులు, అనుచరులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, వర్షాకాలం రైతుబంధు నిధులు విడుదల చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసే వరకు కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు హౌస్ అరెస్టలో ఉన్నారు.

# కలసి రాని ఒంటరి పోరు

న్యూఢిల్లీ,హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేక పోయింది. ఇందుకు కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకోవడం లేదు. కేవలం ఇవిఎంలపైననో లేదా మోడీపై ననో విమర్శలు చేస్తూ తప్పించుకోవడం కుదరదు. ఓటమికి కారణాలను కనుగొనాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి. అదేపనిగా మోడీని తిడుతూ కూర్చుంటే గెలవలేమని గుర్తించాలి. రాజకీయాల తీరు తెన్నులు మారేలా నడుచుకోవాలి. అప్పుడే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది. త ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగంతో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయింది. ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో ... బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆ రాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీ తో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి. హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లో వారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయాని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది. ఈ తరహా రాజకీయాలు కాకుండా కలిసి పోరాడే విధంగా పార్టీని బలోపేతం చేసుకోవాలి. కులరాజకీయాలు, కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టాలి. సమిష్టి రాజకీయాలకు పెద్దపీట వేయాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగలిగితేనే మంచి ఫలితాలు వస్తాయి.

### ఛోటూ అంటూ యవతి పిలుపునకు స్పందన

ముంబై,రతన్ టాటా ఈ పేరంటే సగటు భారతీయుడికి చాలా ఇష్టం. ఒక వ్యాపారవేత్తగానో.. లక్షల కోట్ల సామ్రాజ్యానికి అధిపతిగానో కాదు.. మానవతామూర్తిగా. సోషల్ మీడియాలో టాటాకు పెద్ద ఫ్యాన్‌బేసే ఉంది. ఆయన చేసే ప్రతి చిన్న పనిలోను సమాజం పట్ల బాధ్యత కనిపిస్తుంది. నానో ఆవిష్కరణ.. తాజ్ హోటల్.. సోషల్ మీడియా.. ఇలా చెప్పుకొంటూపోతే ఆ జాబితా చాలా ఉంటుంది. ముఖ్యంగా సమాజాన్ని సరైన దిశలో నడిపేందుకు ఆయన చివరి రోజుల వరకు తనకు చేతనైనంత ప్రయత్నం చేశారు. రతన్ టాటాకు ఇన్‌స్టాలో ఖాతా ఉంది. దానికి ఫాలోవర్ల సంఖ్య మిలియన్ దాటిన సందర్భంగా ధన్యవాదాలు చెబుతూ ఆయన ఒక ఫొటో పోస్టు చేశారు. వినయంగా నేలపై కూర్చొని నవ్వుతున్న ఫొటోను పోస్టు చేశారు. 'అనుకోకుండా దొరికిన అద్భుతమైన కుటుంబం' అని ఆ మైలురాయిని అభివర్ణించారు. దీనికి ఓ యువతి స్పందిస్తూ.. 'కంగ్రాట్యూలేషన్స్ ఛోటూ' అని ఓ హార్ట్ ఎమోజీని జత చేసింది. దీంతో రతన్ టాటాతో అమర్యాదగా వ్యవహరిస్తావా.. ఆమెపై ట్రోలింగ్ మొదలుపెట్టారు. దీంతో భయపడిపోయిన ఆ యువతి కామెంట్‌ను డిలీట్ చేసింది. ఇది టాటా వరకు వెళ్లింది. దీంతో ఆయన ఆమె రక్షణకు స్వయంగా రంగంలోకి దిగారు. ఓ సుదీర్ఘ ఇన్‌స్టా స్టోరీని షేర్ చేశారు. నిన్న ఒక అమాయక యువతి తన మనోభావాలను హృదయపూర్వకంగా వ్యక్తం చేసింది.

# గులాబీ దళపతి ఎందుకు సైలెంట్ అయ్యారు?



హైదరాబాద్,కేసీఆర్.. మూడు అక్షరాల ఈ పదం ఓ సంచలనం. ఆయనే ఓ సైన్యం. అతడే ఆ పార్టీకో నమ్మకం. అలాంటి దళపతి మీడియాలో కనిపించకపోవడం.. తెలంగాణ భవన్‌కు రాకపోవడం క్యాడర్ లోటుగా ఫీల్ అవుతుందట. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాలి తుంటికి గాయం కావడంతో రెస్ట్ తీసుకున్నారు కేసీఆర్. గాయం నుంచి పూర్తిగా కోలుకోక ముందే..కృష్ణాజలాల్లో అన్యాయం జరుగుతుందంటూ నల్గొండలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు.ఆ తర్వాత మళ్లీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఓ రోజు సభకు హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్యాడర్, లీడర్లతో అప్పుడప్పుడు ఫాంహౌస్‌లో పిచ్చాపాటి సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ తర్వాత సైలెంట్ అయిపోయారు కేసీఆర్. ఎవరైనా ముఖ్యనేతలు కలవాలన్నా అక్కడికే పిలిపించుకుని మాట్లాడుతున్నారు.గులాబీ బాస్ సైలెంట్‌గా ఉండటంపై క్యాడర్ ఆందోళన చెందుతుందట. అధినేత మౌనంగా ఉండటంపై పార్టీ నేతలు, కార్యకర్తలు అసంతృప్తిలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. రుణామాఫీ, రైతు భరోసా వంటి పథకాలతో పాటు..హైడ్రా, మూసీ ప్రక్షాళనపై పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు జనంలోనే ఉంటున్నారు. కేసీఆర్ మాత్రం ఎక్కడా నిరసనల్లో పాల్గొనడం లేదు. ప్రెస్‌నోట్లు కూడా ఇవ్వడం లేదు.

### చెక్కుల పంపిణీ పెండింగ్‌లోనే..

గజ్వేల్ ప్రజలు కూడా కేసీఆర్ నియోజకవర్గానికి రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. పది నెలలుగా కేసీఆర్ గజ్వేల్‌కు వెళ్లకపోవడంతో వెయ్యికిపైగా షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ పెండింగ్‌లోనే ఉండిపోయాయన్న చర్చ జరుగుతోంది. కేసీఆర్ ఫాంహౌస్ నుంచి ఎందుకు బయటికి రావడం లేదంటూ సీఎం రేవంత్‌తో పాటు కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నా లైట్ తీసుకుంటున్నారు గులాబీ బాస్.కేటీఆర్, హరీశ్‌రావు, మా సోషల్ మీడియానే తట్టుకోలేకపోతున్నావ్..ఇక బాస్ దిగితే ఫేస్ చేయగలవా అని ఎదురు దాడి చేస్తోంది బీఆర్ఎస్. పార్టీ వ్యవహారాలు, ప్రజా సమస్యలపై కేటీఆర్, హరీశ్ రావులు ఎంత సీరియస్‌గా పనిచేస్తున్నా కేసీఆర్ తెరమీద కనిపించని లోటు మాత్రం స్పష్టంగా ఉందట. సార్ బయటికి వస్తేనే పార్టీలో జోష్ వస్తుందని అనుకుంటున్నారట.

### డిసెంబర్ తర్వాత ఫీల్డ్‌లోకి గులాబీ దళపతి

ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ యాక్టివ్ కాకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు కొందరు బీఆర్ఎస్. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇచ్చే ఆలోచనలో గులాబీ బాస్ ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన మేలేంటో..నష్టమేంటో ప్రజలకే అర్థం అవుతుందని కేసీఆర్ భావిస్తున్నారట.ఏడాది సమయం ఇచ్చి విమర్శించినా ప్రజలు రిసీవ్ చేసుకునే పరిస్థితి ఉంటుందని.. ఆలోపే ప్రభుత్వాన్ని టార్గెట్ చేయొద్దని గులాబీ బాస్ అనుకుంటున్నారట. డిసెంబర్ తర్వాత దళపతి ఫీల్డ్‌లోకి దిగుతారని అంటున్నారు. అప్పటి నుంచి రెగ్యులర్‌గా పార్టీ క్యాడర్, లీడర్లతో రెగ్యులర్‌గా మాట్లాడుతారని..పార్టీ యాక్టివిటీ ఇంకా పెరిగిపోతుందని చెబుతున్నారు.

# ఆ భవంతులను ఏపీ సర్కార్ ఎలా వాడుకోబోతుంది?

విజయవాడ:జిల్ జిగేల్‌మంటూ శ్వేతవర్ణంతో మెరిసిపోతున్న భవంతులు.. పెద్ద పెద్ద ప్రవేశ ద్వారాలు.. విశాలమైన బెడ్రూమ్స్, అందుకు ఏ మాత్రం తీసిపోని స్నానాల గదులు, అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, బాత్ టబ్‌లు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లతో మెరిసిపోయే ఆ వైభోగాన్ని కళ్లారా చూడాల్సిందే తప్ప వర్ణించలేం.ప్రభుత్వ ఖర్చులతోనే నిర్మించిన ఆ కట్టడం ఓ రాజభవనం. ఏ వైట్‌హౌస్ లోపలికో, బకింగ్‌హాం ప్యాలెస్‌లోకో అడుగుపెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. అవే రుషికొండ సౌధం. గత వైసీపీ హయాంలో భీమిలి బీచ్ రోడ్డులో సముద్రాన్ని ఆనుకుని రుషికొండపై కట్టిన భవంతుల చుట్టూ ఇప్పటికీ వివాదం కొనసాగుతోంది.రూ.500 కోట్లతో అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఆ భవనాల్ని ఇప్పుడేం చేస్తారన్న చర్చ మొదలైంది. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ప్రముఖులు వచ్చినప్పుడు అతిథి గృహాలుగా వాడేందుకు కట్టామని వైసీపీ నేతలు చెప్తున్నారు. అయితే అంత వివాదం అయినా అప్పుడు ఎందుకు ఈ విషయాన్ని చెప్పలేదని టీడీపీ ప్రశ్నిస్తోంది.

### కూటమి సర్కార్ తర్జనభర్జన

వైఎస్ జగన్ ఉండటం కోసమే రుషికొండ ప్యాలెస్‌ను కట్టారని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు రుషికొండ భవనాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూటమి సర్కార్ తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వ అవసరాలకే వాడుకుందామా లేక ప్రైవేటుకు ఇద్దామా అనేదానిపై ఇంటర్నల్‌గా చర్చలు జరుపుతోంది పర్యాటకశాఖపై సీఎం చంద్రబాబు పలుసార్లు రివ్యూలు చేసినా ఈ అంశం ప్రస్తావనకు రాలేదు. మంత్రులు దుర్గేశ్, లోకేశ్ విశాఖలో పర్యటించినా రుషికొండ భవనాన్ని సందర్శించలేదు. పర్యాటక శాఖ మంత్రి అయితే అది మ్యూజియంగా తప్ప దేనికి పనికిరాదంటున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్తున్నారు.అయితే ఇప్పటికే ఖాళీగా ఉన్న ఈ భవనాల నిర్వహణకు ప్రతి నెలా లక్షల్లో ఖర్చవుతోంది. నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యం ఉన్న సిబ్బంది లేరు. వీటిని రిసార్టులుగా మార్చాలన్నా అక్కడి నిర్మాణాలు అందుకు తగ్గట్లు లేవు. దీంతో వచ్చే ఆదాయం కన్నా నిర్వహణ భారం ఎక్కువవుతుందని భావిస్తున్నారు. అందుకే రుషికొండ భవనాలను ఏం



చేయాలనే దానిపై ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

### నిర్వహణకే ప్రతిరోజు లక్ష వరకు ఖర్చు!

రుషికొండపై 9.88 ఎకరాల్లో 7 భవనాలు నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో కట్టిన ఈ భవనాల నిర్వహణకే ప్రతిరోజు లక్ష వరకు ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ నిపుణుల అంచనా వేస్తున్నారు. ఈ భవనాలను పూర్తిస్థాయిలో వాడటం మొదలుపెడితే 100 మంది వరకు సిబ్బంది అవసరమని చెప్తున్నారు. మరో 50 మంది షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందని.. ఇప్పటికే కొన్ని వస్తువులు పాడైనట్లు చెబుతున్నారు.ఇక రుషికొండ భవనాలకు విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఐదు నెలల్లో ప్రతి నెలా సగటున 6 లక్షలపైనే బిల్లు వచ్చింది. ఇప్పటివరకు 85 లక్షల విద్యుత్ బిల్లు బకాయి ఉంది. ఖాళీగా ఉన్న భవనాలకే ప్రతినెలా 40 వేల నుంచి 60 వేల యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. అదే వినియోగంలోకి వస్తే ఇది రెండింతలు అవుతుందని అంచనా.భవనాల దగ్గర 10వేల 4 చదరపు మీటర్లలో 58 రకాల మొక్కలు నాటారు. వీటిలో చాలావరకు విదేశాల నుంచి తెచ్చినవే. వాటి నిర్వహణ సరిగ్గా లేక చాలా మొక్కలు ఎండిపోయాయి. అయితే విలువైన ప్రభుత్వ ఆస్తిని నిరుపయోగంగా ఉంచడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలు జనాల్లోకి వెళ్లడం లేదా?

హైదరాబాద్,ఇంకో రెండు నెలలు అయితే పార్టీ పవర్‌లోకి వచ్చి ఏడాది అవుతుంది. ఈ పది నెలల్లోనే ఏంతో చేశాం. రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం..ఫ్రీ బస్సు, కరెంట్ అమలు చేస్తున్నాం.. అయినా ఎందుకు పార్టీ, ప్రభుత్వానికి అనుకున్నంత మంచి పేరు రావడం లేదు. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వ పెద్దలను కలవరపెడుతోందట.ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్నా ఎక్కడో తేడా కొడుతోందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. ఆరు గ్యారెంటీల నుంచి మొదలు ప్రభుత్వ పరంగా చాలా కార్యక్రమాలు తీసుకున్నా ఎందుకో వాటిని జనంలోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నామనే అంతర్మథనం కాంగ్రెస్ నేతల్లో మొదలైందట.పవర్‌లో ఉండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నా చాలా విషయాల్లో పైచేయి సాధించలేకపోతున్నామని అనుకుంటున్నారట కాంగ్రెస్ పెద్దలు. ప్రతిపక్షాలతో పోలిస్తే జనానికి చేరువవ్వడంలో వెనకబడిపోతున్నామని ఫీల్ అవుతున్నట్లు తెలుస్తోంది. మంచి కార్యక్రమాలు చేపడుతున్నా అది వెళ్ళాల్సినంత ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళడం లేదన్న చర్చ ఉందట.

### విమర్శల్ని తిప్పికొట్టలేకపోతున్నామన్న భావన

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉన్న పార్టీ క్యాడర్ అంతా..ఇప్పుడు అధికారంలోకి వచ్చాక సైలెంట్‌గా ఉంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఆఖరికి ప్రతిపక్ష పార్టీల విమర్శల్ని కూడా దీటుగా తిప్పికొట్ట లేకపోతున్నామన్న భావన సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్యనేతల్లో ఉందట. పార్టీ సోషల్ మీడియాలో గతంలో పనిచేసిన టీమే ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడంలో వెనుకబడ్డామన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయట.ఎన్నికలకు ముందు ముఖ్యనేతల నుంచి మొదలు సామాన్య కార్యకర్త వరకు అంతా కాంగ్రెస్ పార్టీని ఓన్ చేసుకుని ప్రతి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారని.. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు సైలెంట్ అయిపోయారో అర్థం కావడం లేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే పార్టీ ప్రక్షాళన దిశగా పీసీసీ కొత్త చీఫ్ ఇప్పటికే కసరత్తు



మొదలుపెట్టారని తెలుస్తోంది. అధికార ప్రతినిధుల విషయంలో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు చెబుతున్నారు.

### పబ్లిక్ మూడ్‌కు తగ్గట్లుగా వెంట వెంటనే డెసిషన్స్!

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న అధికార ప్రతినిధులు ప్రతిపక్షాలని గట్టిగా ఎదుర్కోలేకపోతున్నారన్న అభిప్రాయం ఉండటంతో..సీనియర్ ఎమ్మెల్యేలకు అధికార ప్రతినిధి పదవులు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎమ్మెల్యేలు అధికార ప్రతినిధులుగా ఉంటే వాళ్ళ పలుకుబడి, వాగ్దాటి, అవగాహనతో మీడియాలో ఫోకస్ అవడంతో పాటు ప్రతిపక్షాలకు గట్టిగా సమాధానం చెప్పినట్టు అవుతుందని సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ భావిస్తున్నారట. అంతే కాకుండా సోషల్ మీడియాను మరింత యాక్టివేట్ చేయాల్సిన అవసరం ఉందని కూడా అనుకుంటున్నారట.ప్రభుత్వ కార్యక్రమాలు అనుకున్నంత స్థాయిలో జనంలో వెళ్లడం లేదని.. ఇకపై స్పీడ్ పెంచాలని ఫిక్స్ అయిపోయారట. ఎప్పటికప్పుడు రివ్యూ చేసుకుని పబ్లిక్ మూడ్‌కు తగ్గట్లుగా వెంట వెంటనే డెసిషన్స్ తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అపోజిషన్ చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టి డ్యామేజ్‌ను కంట్రోల్ చేసుకోవాలని డిసైడ్ అయినట్లు టాక్ వినిపిస్తోంది.

# ఆమ్రపాలి,రోనాల్డ్ రోస్ తదితరులకు షాక్

హైదరాబాద్, తెలంగాణలో కొనసాగుతున్న పలువురు ఐఏఎస్ అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆయా ఐఏఎస్ అధికారులు వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆమ్రపాలి కాట, విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న రోనాల్డ్ రోస్, వాణిప్రసాద్, ప్రశాంతితో పాటు పలువురు అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు కేటాయించాలన్న ఐఏఎస్, ఐపీఎస్‌ల అభ్యంతరాలను తోసిపుచ్చింది. వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, మల్లెల ప్రశాంతి తదితర అధికారులు తమను తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. అయితే, వారందర్నీ తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది.ఈ మేరకు ఐఏఎస్ అధికారుల పేరుతో లేఖను రాస్తూ.. వాటి కాపీలను తెలంగాణ, ఏపీ చీఫ్ సెక్రెటరీలకు కేంద్రం పంపింది. అయితే, తెలంగాణ కేడర్ కావాలంటూ 11 మంది అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే, అధికారుల వినతిని కేంద్రం తిరస్కరించింది. అధికారులంతా సొంత రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన అనంతరం ఆమ్రపాలి కేంద్ర సర్వీసుల నుంచి తెలంగాణ సర్వీసుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కొనసాగుతున్న సమయంలోనే జీహెచ్ఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆమెకే ఐదు కీలక పోస్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారు. ఆ తర్వాత జరిగిన బదిలీల్లో మిగతా పోస్టులను నుంచి ఆమెను జీహెచ్ఎంసీ



కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది. ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో జాయినవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్‌కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో

# కొండా సురేఖకు డబుల్ ట్రబుల్.. మంత్రికి మరిన్ని కోర్టు చిక్కులు..!



హైదరాబాద్,అక్కినేని కుటుంబంపై చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో కొండా సురేఖ వెనక్కి తగ్గినా.. కోర్టు కేసులు మాత్రం వదిలేలా కనిపించడం లేదు. ఈ వ్యవహారంపై తెలంగాణ మంత్రికి నోటీసులు జారీ చేసింది నాంపల్లి కోర్టు. మరోవైపు ఇదే అంశంపై కోర్టును ఆశ్రయించిన కేటీఆర్ పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ చేపట్టింది.తెలంగాణ మంత్రి కొండా సురేఖను ఒకే టైమ్‌లో రెండు పరువు నష్టం దావా కేసులు చుట్టుముట్టాయి. అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది.. నాంపల్లి కోర్టు. తదుపరి విచారణను ఈ నెల 23కు కోర్టు వాయిదా వేసింది. ఈ నెల ఎనిమిదిన నాగార్జునతో పాటు సాక్షిగా వచ్చిన సుప్రియ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన కోర్టు.. మరో సాక్షి వెంకటేశ్వర్లు స్టేట్‌మెంట్‌ని ఈ రోజు నమోదు చేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో..అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. దీనిపై అక్కినేని కుటుంబం, సమంతతో పాటు రాజకీయ, సినీ ప్రముఖులు తీవ్రంగా స్పందించారు. కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు మంత్రి కొండా సురేఖ. అయితే కొండా సురేఖ కామెంట్స్‌పై నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు..అక్కినేని నాగార్జున. మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు వందకోట్లకు పరువు నష్టం దావా వేశారు..నాగార్జున.మరోవైపు ఇదే వ్యవహారంలో మాజీమంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు..తదుపరి విచారణను ఈ 14కు వాయిదా వేసింది. తన ప్రతిష్టను దెబ్బతీసేలా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో ఆరోపించిన కేటీఆర్..మంత్రిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్న కేటీఆర్.. కొండా సురేఖ మాట్లాడిన వీడియోలను కోర్టుకు సమర్పించారు. 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను..9ఏళ్లు మంత్రిగా తెలంగాణ రాష్ట్రానికి సేవలు అందించానని.. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి అవార్డులు, పెట్టుబడులు తెచ్చానని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. బెస్ట్ ఐటీ మినిస్టర్‌గా 2020లో అవార్డు తీసుకున్నానని.. అలాంటి తనపై రాష్ట్రమంత్రి కొండా సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తన పరువుకు తీవ్ర భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖపై.. BNS 356సెక్షన్ కింద చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఒకే ఇంట్లో నలుగురు డాక్టర్లు

సిద్దిపేట,ఒకే ఇంట్లో నలుగురు డాక్టర్లు కాబోతున్నారు. సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతుల నలుగురు కుమార్తెలు. వీరంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు పొందారు. పెద్ద కుమార్తె మమత 2018లో ఎంబీబీఎస్ సీట్ పొంది చదువు పూర్తి చేసి డాక్టర్ కాగా..రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొంది చదువుతున్నది.ఈ సంవత్సరం మరో ఇద్దరు కుమార్తెలు రోహిణి, రోషిణి ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ పొందారని, జిల్లాకో మెడికల్ కాలేజీ వచ్చినందుకు ఇది సాధ్యమైందని తండ్రి రామచంద్రం తెలిపాడు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ బిడ్డలు ఇక్కడే ఎంబీబీఎస్ చదువుతున్నారని, ప్రత్యేక తెలంగాణ






Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com